# అర్జునుడు

'ఎవర్రా అన్నయ్యా అది ?' అని అడుగుతున్నది వసంత. బయట - కిటికీ అవతల - సన్నగా వర్షం పడుతున్నది. ఆ పక్కనే పడక కుర్చీలో పడుకుని చదువుకుంటున్న దాశరథికి వరండాలో నుంచి సన్నగా ఒకపిలుపు వినిపించిందికానీ, ముందు గదిలో చదువుకుంటున్న అన్నా చెల్లెళ్లు చూసుకుంటారులే అనిపించి ఆయన లేవలేదు. ప్రభాకరం చెల్లెలితో పెద్దగా 'ఎవడో సైక్లోప్స్. నాన్నగారి కోసం' అనడం వినిపించింది.

మరుక్షణంలో ప్రభాకరం లోపలికి రానే వచ్చాడు. వస్తూనే 'నాన్నా ! మీ కోసమే.... ఎవరో వచ్చారు' అన్నాడు.

సైక్లోప్స్ అన్నమాట వినగానే ఆలోచనలోపడి దాశరథి కుర్చీలో నుంచి లేచాడు..

లోపలినుంచి శాంతమ్మ కూడా పమిటకొంగుకు చేతులు తుడుచుకుంటూ 'ఎవరండీ అది ?' అంటూ వచ్చింది.

'చూస్తాను' అంటూ దాశరథి లేచి వెళ్లాడు. వరండాలో లైటు వెలుగుతున్నది. ఆ వ్యక్తి వర్షంలో తడుస్తూ స్తంభం పక్కన నిలబడివున్నాడు. దాశరథి గొంతు వినగానే తలమీది తుండు తొలిగించి ఇవతలికి వచ్చి దాశరథిని చూసి నవ్వాడు.

దాశరథి అతని దగ్గరగా వెళ్లి పరిశీలనగా చూసి గుర్తుపట్టి 'అర్జునుడా ?' అన్నాడు పెద్దగా.

'అవును.....నేనే. తొందరగానే గుర్తుపట్టావే...' అంటూ అతడు ముందుకు వచ్చాడు.

దాశరథి ఆనందంతో 'అర్జునుడే! ఏమిటబ్బా ఈ రాక? ఎన్నేళ్లకు... ఎన్నేళ్లకు...' అంటూ 'రారా... లోపలికి రా...' అని పిలిచాడు.

మనిషి సన్నగా పొడవుగా వున్నాడు. కొద్దిగా మాసిన దుస్తులు... కొంచెం పెరిగిన గడ్డం... కొంచెం నలిగినట్టున్నాడు.

నవ్వుతూ, తడిసిన చెప్పులు తలుపు పక్కన విడిచి కాళ్లు తుడుచుకుని లోపలికి వచ్చాడు.

ముందు గదిలో చదువుకుంటున్న అన్నా చెల్లెళ్లిద్దరూ తలలెత్తి ఆ కొత్త వ్యక్తి వంకే చూస్తున్నారు.

'తల తుడుచుకో ముందు. పూర్తిగా తడిసిపోయావు' అన్నాడు దాశరథి.

'వసంతా! లోపలికి వెళ్లి టవల్ తెచ్చి ఇవ్వు...'

వసంత పుస్తకం బల్లమీద ఉంచి లోపలికి వెళ్లింది.

అప్పుడే శాంతమ్మ ముందు గదిలోకి వచ్చింది.

'చూశావా, ఎవరొచ్చారో? గుర్తుపట్టు చూద్దాం' అన్నాడు దాశరథి.

శాంతమ్మ ఆ వ్యక్తిని పరీక్షగా చూసి 'అర్జునుడు కదూ?' అన్నది.

ఆ తర్వాత తనూ ఆనందంగానే 'అబ్బో! ఎన్నేళ్ల నాటి మాట! ఇప్పుడు గుర్తువచ్చామా మేము?' అన్నది.

'ఎక్కడమ్మా! నేనేమో వున్న ఊరు కన్నతల్లి అని మా ఊళ్లోనే వుండిపోయాను. అబ్బాయేమో బాగా చదువుకుని ప్రయోజకుడై పెద్ద ఉద్యోగంలో చేరి బదిలీలు బదిలీలు అంటూ దేశమంతటా తిరుగుతూ వున్నాడాయె. అయినా మీ సంగతులన్నీ తెలుస్తూనే వున్నాయికదా! మీ పెద్దబ్బాయి పుట్టినప్పుడు వచ్చాను. ఈ అమ్మాయి మీరెక్కడో బెంగాల్‌లో వుండగా పుట్టింది కదా! ఇదే చూడటం. ఎక్కడో ఒకచోట మీరందరూ పిల్లాపాపాతో బాగున్నారని తెలుస్తూనే వుంది. అదే ఆనందం నాకు. ఇంతకుమునుపు. పల్లెలో వున్న ఇల్లు, పొలం గుర్తుకొచ్చినప్పుడు అప్పుడప్పుడన్నా సెలవులకు వచ్చేవాళ్ళు. అయిదారేళ్ల కిందట అన్నీ అమ్మేసి తెగదెంపులు చేసుకుంటిరి....'

ఇలా సాగింది అతని ధోరణి.

దాశరథి ఈ లోపల కొడుకు దగ్గరగా వెళ్లి నెమ్మదిగానే అయినా, కొంచెం కోపంగా 'నీ స్పెషలింగ్లీషు చదువు ఇలాటి వెధవ తెలివితేటలు చూపించడానికా? అతన్ని సైక్లోప్స్ అంటావా?' అని గొణిగాడు.

ఆ అబ్బాయి తలవంచుకుని 'సారీ నాన్నా!' అన్నాడు.

అర్జునుడు తన ధోరణి ఆపగానే శాంతమ్మ లోపలికి వెళుతూ 'లోపలికొచ్చి కాళ్లు కడుక్కోండి. భోజనాలు చేద్దురుగాని...' అన్నది.

అర్జునుడు చాపమీద కూర్చున్నవాడల్లా లేచాడు. ఒక అడుగు ముందుకు వేసి చేతివేళ్లు విరుచుకుంటూ అదొక విధంగా ఆందోళన చెందుతున్న వాడిలా కనిపించాడు.

దాశరథి 'ఏమిటి ? అదోలా వున్నావు ?' అని అడిగాడు.

అర్జునుడు దాశరథిని పంచలోకి రమ్మని సైగచేసి అటు అడుగులు వేశాడు. పంచలో కొంతమేర సన్నని చినుకుపడుతున్నది. దాశరథి అతని వెనకాలే వెళ్లాడు.

పంచలో ఒకపక్కకు వెళ్లి నిలబడి అర్జునుడు హఠాత్తుగా దాశరథి చేతులు పట్టుకున్నాడు.

'ఏమిటేమిటి ?' అన్నాడు దాశరథి కంగారు పడుతూ.

అర్జునుడి కంటిలో తడి...

దాశరథి గతుక్కుమన్నాడు.

'ఏమిటి అర్జునుడూ ! చెప్పు... ఏమిటి సంగతి ?' అని అడిగాడు మళ్లీ.

అతని కంఠస్వరం వణికింది. గొంతు సవరించుకుని నెమ్మదిగా అన్నాడు.

'నీమీద కొండంత నమ్మకంతో వచ్చాను. నీ అడ్రసుతో పాత ఇంటికి వెళ్లాను వాళ్లు చెబితే వెదుక్కుంటూ వచ్చాను. నువ్వున్నావని, నాకు నువ్వు మాత్రమే వున్నావని భరోసాతో వచ్చాను. నన్ను నువ్వు ఆదుకోవాలి. ఇక నాకెవ్వరూ లేరు..'

దాశరథి చలించిపోయాడు. అతని చేయి అందుకుని నొక్కుతూ 'అంత ఉపోద్ఘాతమెందుకు ? చెప్పు... ఏం చెయ్యాలి నేను ?' అన్నాడు.

'నేనడిగింది ఏమయినా చేస్తావా ?'

'నా వశంలో వున్నదయితే ఏమయినా చేస్తాను' అన్నాడు దృఢంగా దాశరథి.

అర్జునుడు ఒక్కక్షణం ఆగి 'నేను మా అమ్మాయిని కూడా తీసుకొచ్చాను' అన్నాడు.

దాశరథి నివ్వెరపోయాడు.

'మీ అమ్మాయినా ? అంటే... నీకు...'

'మా అమ్మాయే... నీకు అదంతా తర్వాత చెబుతాను. దాన్ని నువ్వూ, అమ్మాయీ కొంతకాలం కడుపులో పెట్టుకుని కాపాడాలి. కొండంత ఆశలతో వచ్చాను.'

దాశరథి తన అనుమానాలన్నీ లోపలే దాచుకుని 'సరే... ఏదీ అమ్మాయి?' అని అడిగాడు.

'మీరేమంటారో అని ఇక్కడికి తీసుకురాలేదు. పైగా నాకే మీ ఇల్లు సరిగా తెలియదాయె...'

'ఎక్కడుంది ఇప్పుడు ?'

'రైల్వేస్టేషన్‌లోనే కూర్చోబెట్టి వచ్చాను.'

'అరె, అదేంపని ! పిల్లను ఒంటరిగా ఈ వేళప్పుడు స్టేషనులో కూర్చోబెట్టి వచ్చావా ? అదేమన్నా బుద్ధివున్న పనేనా ?' అన్నాడు దాశరథి.

తర్వాత హడావిడిగా లోపలికి వెళ్లి గొడుగు తీసుకుని 'శాంతా ! ఇప్పుడే వస్తాము... మీరు భోజనాలు కానిచ్చేయండి' అంటూ ఇవతలికి వచ్చాడు.

పంచ దిగుతూనే గొడుగు విప్పి 'రా... తొందరగా...' అన్నాడు.

అర్జునుడు గొడుగులోకి జరిగి దాశరథి పక్కనే నడుస్తూ 'చిన్నపిల్ల ఏమీ కాదులే... పద్దెనిమిది..పందొమ్మిదేళ్లు.. ఎక్కడికీ కదలకుండా నేను చెప్పిన చోటే కూర్చోమన్నాను' అంటున్నాడు.

'నోరుమూసుకో...తెలివితక్కువ పని చేసి ఇంకా మాట్లాడుతున్నావా ? ఇదేం మీ ఊరనుకున్నావా ? అసలే రోజులు బాగులేవు. దుర్మార్గం ఎక్కువైపోయింది. ఆ వయసు ఆడపిల్ల విషయంలో ఎంత జాగ్రత్తగా వుండాలి! ఏం పనిచేశావు ? నీ లోకజ్ఞానం ఏమైంది ? అని కసురుతూనే నడిచాడు దాశరథి.

కనబడిన రిక్షా ఆపి బేరమాడకుండానే ఎక్కి 'స్టేషనుకి...' అని మాత్రం అన్నాడు.

ఇప్పుడు అర్జునుడు కొంచెం కంగారుపడుతున్నట్టు కనిపించాడు.

'అవును... పొరపాటే చేశాను. ముందు మీతో మాట్లాడి, తర్వాత తీసుకురావచ్చు కదా అనుకున్నాను' అంటున్నాడు.

దాశరథి మరేమీ మాట్లాడలేదు. లోలోపల చాలా ప్రశ్నలు. అర్జునుడు ఇంతకాలం తర్వాత ఇలా రావడమేమిటి ? కూతురు అనడమేమిటి ? ఇతనికి పెళ్లెప్పుడయింది ? అయితే తనకు తెలియకపోవడమేమిటి ? పెళ్లి ఎవరితో అయింది ? కాపురం ఎప్పుడు ? ఆతల్లి ఏమయింది ? వగైరా ప్రశ్నలతో మనసంతా అప్పటి ఆకాశంవలె చీకాకుగానే తయారైంది.

స్టేషను దగ్గరవుతున్న కొద్దీ అర్జునుడిలో కంగారు ఎక్కువయింది.

వొణుకుతున్న చేతివ్రేళ్లను – ఆ అద్భుతమైన చేతి వ్రేళ్లను – మాటిమాటికీ విరుచుకుంటూ, తనలో తాను ఏమేమో గొణుక్కుంటూ అలజడిపడిపోయాడు.

రిక్షాలోనుంచి దాదాపు దూకినంత పనిచేశారిద్దరూ. 'ఇక్కడే వుండు' అని రిక్షావాడికి చెప్పి మెట్లెక్కి వెళ్లారు.

అర్జునుడు దాదాపు పరుగెత్తుతూ వెళ్లాడు. దాశరథి అతన్ని అనుసరించాడు.

ఆ పెద్ద హాలులో ఒకవైపున... అప్పటికే అనుకున్నంతా మొదలయినట్టున్నది... దాశరథి భయపడ్డట్టే జరుగుతున్నది. అంతే అదృష్టవశాత్తు పరిస్థితి చెయిదాటిపోలేదింకా.

గోడనానుకుని ఒక చేతిసంచీ ఒళ్లో పెట్టుకుని గువ్వలాముడుచుకుని కూర్చుని వుంది ఆ అమ్మాయి.

ఎదురుగా ముగ్గురు నలుగురు వున్నారు. అంత మర్యాదస్తుల లాగా లేరు. ఒకడు మాత్రం ఆ అమ్మాయికి బాగా దగ్గరగా నిలబడి వంగి మాట్లాడుతున్నాడు.

అర్జునుడు వేగంగా వెళ్లి ఆ మనిసిని మెడ పట్టుకుని లేపి నిలబెట్టాడు. వాడు కంగారుపడుతూ నిలబడ్డాడు.

అర్జునుడు కరుకుగా 'ఏమిటి మాట్లాడుతున్నావు ?' అని అడిగాడు.

వాడు నంగినంగిగా 'ఏమీలేదు. ఒంటరిగా వుంటేనూ.. తప్పిపోయిందేమో

కథా నిలయం
3760
శ్రీకాకుళం

తెలుసుకుని సాయంచేద్దామని...' అంటున్నాడు.

ఆ అమ్మాయి మాత్రం కళ్ళు పెద్దవిచేసుకుని చూస్తున్నదే తప్ప నోరువిప్పి ఏమీ మాట్లాడలేదు. అర్జునుణ్ణి చూడగానే ఆ ముఖం గొప్ప ఆనందంతో వికసించింది. కళ్లు నీళ్లతో నిండాయి.

'ఓహో! సాయం చేద్దామని దగ్గరికి చేరావా?' అంటూ అర్జునుడు వాడి మెడమీద చెయ్యివేసి 'మంచివాడివే' అని కూడా అంటూ చేతి వ్రేలితో ఏం చమత్కారం చేశాడో తెలియదు, వాడు మాత్రం వున్నట్టుండి క్షణంలో మూలుగుతూ కూలబడిపోయాడు.

వాడి మిత్రులు ముందు అర్జునుడి మీదికి ఏమిటేమిటంటూ రాబోయారుకాని, అర్జునుడి వాలకంచూసి ముందడుగు వెయ్యలేక నిస్సహాయులై తమ మిత్రుణ్ణిలేపి నడిపించుకుంటూ వెళ్లబోయారు.

అర్జునుడు 'బాబులూ! ఆగండి... రండి ఇటు.. వాణ్ణి ఇటు తీసుకురండి. సరిచేస్తాను. లేకపోతే నాలుగైదు రోజులు లేవలేడు' అన్నాడు.

ఆ తర్వాత వాడు దగ్గరికి రాగానే మళ్లీ తన చేతి వ్రేళ్లను వాడి మెడచుట్టూ పోనిచ్చి మళ్లీ ఏం చమత్కారం చేశాడో మరి వాడి బాధ తగ్గి ముఖంలో మామూలు కళ వచ్చింది.

మరునిముషంలో వాళ్లు 'బ్రతుకుజీవుడా' అని వెళ్లిపోయారు.

దాశరథి ఈలోపల చాలా ఆనందించాడు. జరగరానిది ఏమీ జరగనందుకు తేలికగా ఊపిరిపీల్చి 'అమ్మయ్య' అనుకున్నాడు.

ఆ అమ్మాయి అప్పటికి తెప్పరిల్లిలేచి చేతి సంచిని గుండెలకదుముకుంటూ నిలబడింది. గుండ్రని అందమైన ముఖం...పలుచని చెక్కిళ్లు.. పెద్ద పెద్ద కళ్లు.. అర్జునుడు చెప్పినట్టే పద్ధెనిమిది, పందొమ్మిదేళ్ల ప్రాయం.

అర్జునుడు ఆ అమ్మాయి దగ్గరగా వెళ్లి భుజం మీద చెయ్యివేసి దగ్గరికి తీసుకున్నాడు. ఆ అమ్మాయి కళ్లు నీళ్లతో తళతళలాడుతూ వుండగా అతన్ని ఆనుకుని నిలబడింది.

'ఏం జరిగింది? వాడు ఏమంటున్నాడు?' అని అతడు అడగనూలేదు. ఆ అమ్మాయి జరిగిందిదీ అని చెప్పనూలేదు.

'ఊ! పదండి. పదండి' అంటూ దాశరథి ఇవతలికి వచ్చాడు.

మెట్లు దిగివచ్చి వేచివున్న రిక్షాలో వారిద్దరినీ ఎక్కమన్నాడు. తాను మరో రిక్షా ఎక్కాడు.

రిక్షాలు వేగంగా కదిలాయి.

పెద్దవాన ఏమీ కాదుకానీ... జల్లు ఇంకాపడుతూనే వుంది. తనివితీరని మబ్బులు చివరి చినుకులను కురుస్తూనే వున్నాయి. చల్లనిగాలి వీస్తున్నది. దాశరథి. మనసులో అనేక ప్రశ్నలు.. అనుమానాలు...

ఈ అర్జునుడు..

దాశరథికి బాల్యమిత్రుడు. ఎక్కడో మారుమూల పల్లె... ఊరిచుట్టూ చింత, కుంకుడు చెట్లు.. దట్టంగా వెదురుపొదలు... ఒకవైపున పొలాలు.. పొలాలంటే

. 0373

సారవంతమైన భూములేవి కావు. 'అంతయా నువ్వులు, ఆముదాలు' వేరుశెనగ పంటలు..

ఊళ్లో అతి ముఖ్యమైన గౌరవనీయమైన కుటుంబం దాశరథి వాళ్లది.

దాశరథి తండ్రి ఊరికి పెద్ద... ఊరి మంచీ చెడూ అంతా ఆయనే పట్టించుకునేవాడు. అర్జునుడికి చిన్నతనంలోనే తల్లిపోయింది. తండ్రి అదోక తరహాగా వుండేవాడు. భార్య చావుతో ఆయనలో ఆధ్యాత్మిక చింతన పెరిగింది. అప్పటికే నలభై దాటాయి. అర్జునుడు ఆలస్యంగా కలిగిన సంతానం.

ఆయన నిరంతరం పూజలనీ పునస్కారాలనీ క్షేత్రాలనీ తీర్థయాత్రలనీ హడావిడిగా వుండేవాడు. అర్జునుడి ఆలనాపాలనా చూసేవారెవరూ లేరు. వాడు జుట్టు పెంచుకుని ఊరిమీదపడి తిరుగుతూ వుండేవాడు. ఎక్కడ ఆకలి అయితే అక్కడ తినడం, ఎక్కడ నిద్ర వస్తే అక్కడ పడి నిద్రపోవడం.. తల్లి లేనివాడు కావడం వల్లను పిన్నవాడు కావడంవల్లను ఊళ్లో అందరూ కులమత భేదాలు లేకుండా వాణ్ణి ఆదరించేవారు.

వాడు, దాశరథి, కరీముల్లా కలిసి తిరుగుతూ వుండేవారు. కరీముల్లా బలంగా వుండేవాడు. వాడూ అర్జునుడూ అన్ని విషయాల్లోనూ సమవుజ్జీలు. ఆ ఇద్దరూ, అర్భకుడు కావడంవల్ల దాశరథిని ఎంతో ప్రేమగా చూసుకునేవారు.

దాశరథికి బాగా గుర్తు.. ఒక వేసవిలో ఎక్కడి నుంచో వచ్చిన ఆటగాళ్లతండాలో ఒకడు దాశరథిని లోకువచేసి కొట్టాడు. దాశరథి ఏడుస్తూ వెళ్లి తన మిత్రులిద్దరికీ జరిగిన అవమానాన్ని చెప్పాడు. అప్పటికి దాశరథికి పదేళ్లు వుంటాయేమో !

మిత్రులిద్దరూ దాశరథి కంటే ఏ రెండుమూడేళ్లో పెద్దవాళ్లు. దాశరథి చెప్పింది విని ఇద్దరూ వెళ్లి ఊరి బయట డేరాలో వున్నవాణ్ణి పిలిచి సవాల్ చేశారు. వాడు వీళ్లకంటె పెద్దవాడూ బలశాలికూడా. వాడు పొగరుగా వచ్చాడు. వాడు ఈ ఇద్దరినీ ఎదుర్కొన్నాడు. ముందు మాత్రం వాడిదే పైచేయి అనిపించింది. కానీ క్రమంగా వాళ్లిద్దరూ విజృంభించి వాణ్ణి చెరోవైపు నుంచి చావగొట్టి వదిలిపెట్టారు.

తర్వాత దాశరథి తండ్రి పోవడం... అతని తల్లి కొడుకునూ కూతుర్నీ తీసుకుని తన తమ్ముడి దగ్గరికి పట్నం చేరడం జరిగాయి. ఆ విధంగా దాశరథి మిత్రులకు దూరమైనాడు. ఇక అతడు బలవంతంగా తప్పనిసరిగా చదువులో పడ్డాడు. హైస్కూలు చదువు పూర్తికాగానే కాలేజీలో చేరాడు. తర్వాత అతని తల్లి కూడా పోయింది. అక్క పెళ్లి అయి భర్తతో విశాఖపట్నం వెళ్లిపోయింది. అంతకాలమూ అతని మేనమామే పల్లెలోని ఇల్లూ పొలమూ వాటి మీద ఆదాయవ్యయాలు చూసేవాడు.

తర్వాత దాశరథి చదువు పూర్తిఅయి అదృష్టవశాత్తు మంచి ఉద్యోగం దొరకడం పెళ్లి అయి సంసారి కావడమూ జరిగాయి. ఆ తర్వాత అర్జునుడు వీరెక్కడ వుంటే అక్కడికి వచ్చి వేరుశనగ పంట తాలూకు లెక్క అప్పజెప్పేవాడు. ఆ పొలం సాగు వ్యవహారం అంతా అతనే చూసేవాడు. వచ్చినప్పుడల్లా ఒకటి రెండు రోజుల పాటు వుండిపోయేవాడు.

రిక్షా మలుపుతిరుగుతున్నది. జల్లు ఇంకా తగ్గలేదు. దాశరథి మనసులో ఎక్కడో కలుక్కుమన్నది.

తన కొడుకు అర్జునుణ్ణి చూస్తూనే సైక్లోప్స్ అన్నాడు.

ఆ విషయం గుర్తుకొచ్చే సరికి దాశరథి మనసంతా అతలాకుతలం అయిపోతుంది. అవును. తనవల్ల అర్జునుడికి జరిగిన హాని అలాంటిది. ఆ పాపం తను చేసినదే. అదీ చిన్నప్పటి సంగతి.

తాము ఆ ఊరు విడిచి రాకముందు... తనతండ్రి చనిపోయిన కొద్దికాలానికి... ఒకనాటి సాయంకాలం అతనికి బాగా గుర్తు. నీచమైన సాయంకాలం... క్రూరమైన సాయంకాలం... జుట్టువికృతంగా విరబోసుకున్న భయంకర రాక్షసి లాటి చింతచెట్టు కింద ఆడుకుంటున్నారు. అయిదుగురో, ఆరుగురో కర్రా బిళ్లా. పట్టుదలలు పెరిగి ఉన్నాయి. ఎవరికివారు తామే గెలవాలని పట్టుదలతో కసిగా ఆడుతున్నారు.

దాశరథి ఉన్నట్టుండి బిళ్లను లేపి బలంగా, కసిగా కొట్టాడు. బిళ్ల విపరీతమైన వేగంతో ఎగిరి వెళ్లింది. దాన్ని పట్టుకుందామని అర్జునుడు గాలిలోకి ఎగిరి ప్రయత్నించడం వరకు తెలుసు. క్షణంలో ఏం జరిగిందో తెలిసేలోపల అర్జునుడు ముఖం చేతులతో కప్పుకుని మూలుగుతూ కూలబడిపోయాడు. తర్వాత చూస్తే ఏముంది ? వాడి ముఖం నిండా నెత్తురు. ఆ విధంగా వాడి ఎడమ కన్ను పోయింది.

అయితే తర్వాత తర్వాత అర్జునుణ్ణి గురించి తెలుసుకుని దాశరథి ఆశ్చర్యపోయాడు. విలువిద్యలో అర్జునుడు అర్జునుడే... ఊళ్లో పని లేనప్పుడు ఊళ్లు తిరుగుతూ స్కూళ్లో, కాలేజీలలో పెద్ద పెద్ద ఆఫీసులలో విలు విద్యా ప్రదర్శనలు ఇస్తూ ఉండేవాడు.

పత్రికలలో పెద్ద ఎత్తున ప్రచారంకానీ, అట్టహాసంగా పొగడ్తలుకానీ ఏమీలేవు. అతడు ప్రచారంకోసం తాపత్రయపడిందీలేదు. తన ఒక్కడి పొట్ట కోసం అన్నట్టు కాలం గడిపేవాడు. ఇప్పటిలాగా ప్రతి అంగుష్ఠ మాత్రుడికీ ప్రచారం చేసి పెట్టే తైనాతీలూ లేరు. అలా మరుగునపడిన మాణిక్యంలాగా ఉండిపోయాడు. అంత గొప్ప ధనుర్విద్య కేవలం పొట్ట పోసుకోడానికే అన్నట్టు అయింది అతని విషయంలో ఇప్పుడు..

ఇన్నేళ్ల తర్వాత...

ఇలా ఊడిపడ్డాడు.

వెంట వయసులో ఉన్న ఒక అందమైన అమ్మాయి !

రిక్షాలు ఆపి వాళ్లకు డబ్బులిచ్చి పంపేసి గేటు తీసుకుని లోపలికి వెళ్లారు.

శాంతమ్మ మాత్రం పంచలో గడప ఇవతలే నిలబడి వుండి ఎదురుచూస్తున్నట్టున్నది.

వీరిని చూడగానే శాంతమ్మ హడావిడిగా 'ఏమీ చెప్పా పెట్టకుండా ఎక్కడికి వెళ్లారు? ఏం జరిగిందో అని భయపడి ఛస్తున్నాను' అన్నది.

'ఏమీలేదులే' అంటూ దాశరథి ముందు మెట్లెక్కి పంచలోకి వెళ్లి - 'ఆ అమ్మాయిని లోపలికి తీసుకువెళ్లు' అన్నాడు నెమ్మదిగా.

'ఎవరా అమ్మాయి ?' అని అడిగిందావిడ ఆశ్చర్యంగా.

ఈలోపల అర్జునుడూ కూతురూ పంచలోకి వచ్చారు.

దాశరథి నవ్వుతూ - 'ఎవ్వరా ? మన అర్జునుడి కూతురు. ఇతనెంత ఘనకార్యం చేశాడో చూడు. రైలుదిగి ఆ అమ్మాయిని స్టేషన్లో కూర్చోబెట్టి ఒక్కడూ ఈ వర్షంలో మన ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు. అదేమని అడిగితే తన కూతుర్ని మన ఇంట్లోకి రానిస్తామో లేదో కనుక్కుని మనం అవునంటే వెళ్లి తీసుకొద్దామని అనుకున్నానంటున్నాడు' అన్నాడు.

శాంతమ్మ నివ్వెరపోయి చూసింది. తర్వాత ఆ అమ్మాయి ఆపాదమస్తకం చూసి ప్రసన్న కంఠ స్వరంతో - 'బాగానే వుంది సంబడం... ఇంట్లోకి రాని స్తామోలేదో అని అనుమానం వచ్చిందా ? అందుకని పిల్లను ఒంటరిగా స్టేషనులో కూర్చోబెట్టి వస్తావా'? రోజులెట్లా ఉన్నాయి ? ఇంకా నయం... ఏ దుర్మార్గులో మందో మాకో పెట్టి ఎత్తుకు 'పోలేదు' అన్నది.

'అంత పనీ జరిగేదే.. సరిగ్గా సమయానికి వెళ్లాం కాబట్టి సరిపోయింది. లేకపోతే ఈ పిల్ల చెయ్యిదాటి పోయేదే' అన్నాడు దాశరథి.

లోపలి గదిలోనుంచి వచ్చిన అన్నాచెల్లెళ్లిద్దరూ వింతగా చూస్తున్నారు.

దాశరథి వారితో - 'ఈ అమ్మాయి మన అర్జునుడి కూతురు. అర్జునుడు మనకు, ముఖ్యంగా నాకు ఆరో ప్రాణం' అని చెప్పాడు.

శాంతమ్మ అమ్మాయి భుజంమీద చెయ్యి వేసి - 'నీ పేరేమిటమ్మాయీ ?' అని అడిగింది.

అర్జునుడే -'భాను...భానుమతి' అని చెప్పాడు. 'అదీ నువ్వే చెప్పాలా ? ఆ అమ్మాయి చెప్పలేదూ? లేకపోతే నోరు విప్పితే ముత్యాలు రాలిపోతాయా ? పోన్లే.. తర్వాత తీరికగా అవన్నీ చెబుదువుగాని. ముందు లోపలికి వచ్చి స్నానం చెయ్యి. ఆ పైన నాలుగు మెతుకులు తిను. ఎప్పుడు తిన్నావో ఏమో ! తొమ్మిది దాటింది' అంటూ, శాంతమ్మ వసంతవైపు తిరిగి - 'లోపలకు తీసుకువెళ్లవే' అంటూ తాను కూడా లోపలికి వెళ్లింది.

బయట వరండాలో లైటు ఆర్పాడు దాశరథి. తర్వాత కదలకుండా ప్రతిమలా నిలబడి వున్న అర్జునుడి భుజంమీద చెయ్యివేసి - 'రా.. లోపలికి రా...' అన్నాడు. అర్జునుడొక్కసారిగా దాశరథి చేతులు పట్టుకుని నుదుటికి అద్దుకున్నాడు. దాశరథి - 'వెర్రివాడా... జరిగిందంతా అదృష్టమే అనుకో' అన్నాడు.

ఆ రాత్రి భోజనాలయ్యాక అంతా ప్రశాంతంగా ఉన్నవేళ.

ముందుగదిలో చాపమీదపడుకున్నాడు అర్జునుడు. భాను ఆ పక్కనే ఒక దుప్పటి పరుచుకుని పడుకుంది.

దాశరథికి తొందరగా నిద్రపట్టలేదు. బయట వర్షపు జోరు తగ్గి కిటికీలో నుంచి చల్లని గాలి మాత్రం వీస్తున్నది.

అర్జునుడు చాలాసేపు మాట్లాడుతూ ఉండిపోయినట్టుతెలుస్తున్నది. ఏం చెబుతున్నాడో తెలియలేదు. బహుశా కొత్త చోట ఎలా మెలగాలో వగైరా బుద్ధులు చెబుతున్నాడేమో అనిపించింది దాశరథికి.

తెల్లగా తెల్లవారాక బద్ధకంగా లేచాడు.

కిటికీలో నుంచి చూస్తే ఆవరణలో మొక్కలు, పరిసరాలు అన్నీ శుభ్రంగా కడిగినట్టు తళతళలాడుతూ కనిపించాయి. కాలం చెల్లిపోయినా ఒక వృద్ధ కోయిల మాత్రం పక్క ఇంటి మావి గుబురులలో దాగి విసుగులేకుండా కూస్తున్నది.

కప్పుకున్న దుప్పటి తొలగించి లేచిన దాశరథికి అప్పుడే లోపలికి వస్తున్న శాంతమ్మ నవ్వు ముఖంతో కనిపించింది.

'సెలవులుకదా అని బద్ధకించి పడుకున్నట్టున్నారు. లేపడం ఎందుకని ఊరుకున్నాను. అన్నట్టు అర్జునుడు చీకటితోనే లేచి వెళ్లిపోయాడు.'

దాశరథి ఉలిక్కిపడ్డాడు.

'అదేమిటి ? ఎందుకు వెళ్లిపోయాడు ?' అని అడిగాడు.

'ఏమో ! నాకు మాత్రం తెలుసా ? అందరూ నిద్రలో ఉన్నారు. నేను లేచి ముందుగదిలోకి వెళ్లేసరికి ఆ పిల్ల ఒక్కతే గోడకానుకుని కూర్చుని ఉంది. అర్జునుడేడి? అని అడిగితే దిగులుగా వెళ్లిపోయాడని సైగచేసింది. చూడబోతే ఈ పిల్ల మూగదిలా ఉంది. మాటా పలుకూ లేదు. లేచింది. తలారా స్నానం చేసింది. వాకిలి, పంచ శుభ్రంగా చిమ్మింది. వాకిట్లో నీళ్లు చల్లి ముగ్గు వేసింది. పనిమంతురాలే' అలా శాంతమ్మ మాట్లాడుతూ ఉన్నప్పటికీ దాశరథికి మాత్రం కోపం వచ్చింది.

'అర్జునుడిలా ఏమీ చెప్పకుండా వెళ్లిపోవడం ఏమిటి ? అంతకొంప మునిగే రాచకార్యాలేమున్నాయి గనక ?' అనుకుని రుసరుసలాడాడు.

అన్నాచెల్లెళ్లిద్దరూ ఆనాటినుంచే సెలవులు మొదలు కావడంవల్ల హుషారుగా ఉన్నారు. కార్యాలన్నీ తీర్చుకుని శుభ్రంగా తయారై ఇద్దరూ చెరోవైపునా చేరి ఆ అమ్మాయితో మాటలు పెట్టుకున్నారు. ప్రశ్నల వర్షం కురిపించారు.

'నీ పేరు భానుమతి కదూ ?' అని వసంత.

'అవును' ని తల ఊపడమే సమాధానం.

'అర్జనుడు మీ నాన్నగారా ?' అని ప్రభాకరం. మళ్లీ అదే సమాధానం.

వసంత 'అర్జనుడుకాదురా అన్నయ్యా ! అర్జునుడ అనాలి' అన్నది.

'పోదూ, మరీను. అర్జనుడంటేనే బాగుంది. ఫొనెటిక్‌గా కరెక్టు. అర్జునుడంటే బాగులేదు' అని ప్రభాకరం.

'అదంతా నాకు తెలీదు. అర్జునుడే కరెక్టు' వసంత. 'నీకు తెలుసేమిటి మహా'

'పోనీ భానూ ! నువ్వు చెప్పు... రెంటిలో ఏది కరెక్టు ?'

భాను చక్కగా నవ్వింది. వసంతవైపు చేయి చూపించింది.

మొత్తానికి పిల్లలు కలిసిపోయారు. దాశరథి వారిని చూసి ఆనందించాడు.

'కానివ్వు... చూద్దాం. ఎన్నాళ్లు గడిస్తే అన్నాళ్లు. పిల్ల మాత్రం బుద్ధిమంతురాలులాగే వుంది' అనుకున్నాడు తృప్తిగా.

ఆ మధ్యాహ్నం శాంతమ్మ భర్తకు మంచినీళ్లు అందిస్తూ 'చిత్రంగా లేదూ ?' అన్నది.

'ఏమిటి చిత్రం?'

'అదే. అర్జునుడికి పెళ్లెప్పుడయింది ? కూతురెప్పుడు పుట్టింది ? ఇన్నాళ్లు ఎలా ఉంది, మనకు ఈ విషయం తెలియకుండా ? ఆ పిల్ల తల్లి ఏమయింది ? ఇదంతా తమాషాగాలేదూ ?'

'వాడి స్వభావమే అంత. మహాగుంభన మనిషి. అదేమో చిన్న ఊరు. వీడా పెరిగి పెద్దవాడైనాడు. బుద్ధిమంతుడు కూడాను. బొత్తిగా ఏమీ లేని పేదవాడూ కాదు. కొంచెం పొలం ఉంది. చేతిలో విద్య ఉంది. ఎవరో నడుం కట్టుకుని గంతకు తగ్గ బొంత అని చేసి ఉంటారు.'

అంతవరకూ బాగానే ఉంది. 'ఆ తర్వాత...?' దాశరథి ఆ తర్వాత ఊహించ లేకపోయాడు. ఏమో ! ఏం జరిగిందో తనంతట తాను చెబితే కాని తెలియదుకదా ! అని ఊరుకున్నాడు.

శాంతమ్మ మనసులో ఒక దురూహ మెదిలింది. అంతలోనే అర్జునుణ్ణి గురించి అలాటి ఆలోచన వచ్చినందుకు తననుతానే వందలించుకుంది. 'ఏమిటి ఆలోచిస్తున్నావు?' అని అడిగాడు దాశరథి.

'ఏమీలేదు'

'కాదులే. ఏదో ఉంది. ఉన్నట్టుండి ఏదో పిచ్చి ఆలోచన వచ్చింది. తెలివి తక్కువ ఆలోచన.'

'అన్నట్టు అర్జునుడికి వయస్సెంత ఉంటుంది ?'

దాశరథి ఉలిక్కిపడ్డాడు. అంతలోనే సంబాళించుకున్నాడు.

'నాకన్నా ఏ రెండు మూడేళ్లో పెద్దవాడు. నాకే నలభై అయిదు వెళ్లాయి' అని - మళ్లీ నవ్వుతూ - 'నీ మనసులోకి ఏ దయ్యమో ప్రవేశించింది. నువ్వేమనుకున్నావో నాకు తెలుసులే. అర్జునుడు అంత పనికిమాలిన పనులు చేసే నీచుడుకాదు. పైగా ఆ పిల్లకూ అతనికీ ఎంత అంతరం ఉంది ? ఆ ఊహ రావడమే తప్పు. అసలు కథ ఏదో వేరే ఉంది. అతనేమో ఏమీ చెప్పకుండా ఉడాయించాడు' అన్నాడు.

'ఈ పిల్ల చూద్దామా మూగమొద్దులాగున్నది. ఒక మాటా పలుకూ ఏమీలేదు. సైగలు తప్ప. చెప్పింది మాత్రం వినిపించుకుంటుంది. చూస్తున్నాను కదా ! అమితమైన శుభ్రత... అణకువగల పిల్ల. పనులన్నీ శుభ్రంగా వచ్చు' అన్నదామె.

'వంట ఇంట్లో చేర్చావా ?'

'తనే వచ్చింది. చక్కగా పై పనులన్నీ చెయ్యడమే కాక ఎంతో సాయంగా ఉంది.'

ఇంతలో వసంతా, ప్రభాకరం ఇద్దరూ బిలబిల లాడుతూ వచ్చారు లోపలికి.

నాన్నా ! నాన్నా ! భానుకు చదువు రాదు అక్షరాలు కూడా రావు. ఇంగ్లీషు సరేసరి. తెలుగక్షరాలు కూడా కూడబలుక్కుంటూ రాస్తుంది. తెలుగులో అక్షరాలు మాత్రం వచ్చు. అంతే తన పేరు చూడు ఎలా రాసిందో !

దాశరథి అదిరిపడ్డాడు. తీరా పుస్తకం అందుకుని చూస్తే అందులో వంకర టింకర

అక్షరాలు.. బనుమతి అని రాసి ఉంది.

ప్రభాకరం మరింత విడ్డూరంగా – 'టైము చూడ్డం కూడా రాదు నాన్నా' అన్నాడు.

దంపతులిద్దరూ ఆశ్చర్యంతో తలమునకలైనారు.

శాంతమ్మ భాను దగ్గరికి వెళ్లి అనునయంగానే – 'ఏమీ చదువుకోలేదా అమ్మాయీ నువ్వు ?' అని అడిగింది.

సమాధానం మామూలే.

'సినిమాలేమన్నా చూశావా ?' అని అడిగింది వసంత.

మళ్లీ అదే సమాధానం.

'ఒక్క సినిమా కూడా చూడలేదా, పుట్టినప్పటి నుంచీ ?' అని ఆశ్చర్యపోవడం వసంతవంతయింది. దాశరథి భార్యతో విడిగా ఉన్నప్పుడన్నాడు – 'ఇలాంటి అయోమయపు పిల్లను అతిజాగ్రత్తగా కనిపెట్టి ఉండాలి !'

శాంతమ్మ తల ఊపింది.

ఆ మరునాటినుంచి ఇంట్లో అన్నాచెల్లెళ్లిద్దరికీ సెలవులు కావడంతో చేతినిండా పని తగిలినట్టయింది. ప్రారంభమైంది కోలాహలం.

పలకా, బలపమూ తెప్పించారు. ఇద్దరూ చెరొక వైపునా కూర్చుని మాటలు వ్రాయించడం, తప్పులు దిద్దడం, దీంతో వారికి కొత్తగా, ఆనందంగా కాలక్షేపం అవుతున్నది.

*****

అర్జునుడు మండుటెండలో నడుస్తున్నాడు. భుజాన పొడవాటి తోలు సంచీ మోకాళ్లు దాటి వేలాడుతున్నది. కాళ్లకున్న చెప్పులు సగం అరిగిపోయి అకుల్లాగున్నాయి బలహీనంగా.

ఆకాశంలో సూర్యుడు మండిపడుతూ నిప్పులు కురిపిస్తున్నాడు.

అర్జునుడి ముఖం నిండా చెమట. ఒకచోట ఆగి ముఖమంతా పైతుండుతో తుడుచుకున్నాడు. తర్వాత ఎదురుగా ఉన్న టీ స్టాలువంక నడిచాడు. అక్కడ బల్లమీద కూలబడి పై జేబులో డబ్బులు తీసి లెక్క పెట్టుకున్నాడు.

'ఒక టీ' అన్నాడు.

ఆ తర్వాత తీరికగా టీ చప్పరిస్తూ కూర్చున్నాడు. ఎదురుగా పెద్ద ఆవరణ. లోపల హైస్కూలు. విశాలమైన వరండాలు. పెద్దపెద్ద గదులు. ఆవరణలో వరుసలు వరుసలుగా నేరేడు చెట్లు.

టీ తాగిన తర్వాత జేబులోనుంచి ఒక కవరు ఇవతలికితీశాడు. దానిమీద 'రవీంద్ర, ఎం. ఏ. సీనియర్ టీచర్, జడ్.పి. హైస్కూలు' అని ఉంది.

దాన్ని మళ్లీ పై జేబులో ఉంచుకుని టీ స్టాలులో చిల్లర ఇచ్చి భుజం మీద బరువు సర్దుకుంటూ గేటు దాటి స్కూలులోకి నడిచాడు.

లోపల వరండాలో ఎదురైన వ్యక్తిని సమీపించి నమస్కారం చేసి జేబులోని కవరు తీసి ఇచ్చాడు.

ఆ వ్యక్తిపైన అడ్రసు చూసి చెయ్యి జాపి – 'అటు వెళ్లి కుడివైపు తిరిగితే మొదటి గది. ఆయన అక్కడే ఉన్నాడు. ఖాళీగా ఉన్నాడు కూడా' అని అంటూ మంచిగా అవసరమైన సమాచారం అందించి వెళ్లిపోయాడు.

అర్జునుడు ఆ గది ముందుకు వెళ్లి నిలబడ్డాడు. భుజం మీది బరువు బయటే దింపుకుని గోడకానించి ఉంచాడు. లోపల ఇద్దరు ముగ్గురున్నారు. ఒకాయన అర్జునుడి దగ్గరి నుంచి కవరు అందుకుని చూసి 'నీ కోసమేనయ్యా' అన్నాడు మరొకాయనతో.

రవీంద్ర అనబడే ఆయన మధ్యవయసువాడు. ఆయన అర్జునుడివంక విచిత్రంగా చూస్తూ కవరు అందుకుని చదువుకున్నాడు.

'ఈ మనిషి పేరు అర్జునుడు. నాకు ముందు ఏ మాత్రమూ పరిచయం లేదు. ఒక మిత్రుడు ఉత్తరం రాసి పంపించాడు. నేనూ అలాగే నీ దగ్గరికి పంపుతున్నాను. విలువిద్యలో ప్రవీణుడు. స్కూల్లో విద్యా ప్రదర్శన ఏర్పాటుచేయించాను.

ముందు ఆ ఒంటికన్ను, ఆ వాలకం చూసి భయపడ్డాను. తర్వాత కొద్దిగా పరీక్షించాను. స్కూలు ఆవరణలో అతని విద్యా ప్రదర్శన ఏర్పాటుచేశాను. అతని విద్యానైపుణి అద్భుతం అని చెప్పాలి.

పేదవాడు. పిల్లలు, పెద్దలు తన విద్య చూసి ఎంత ఇస్తే అంత పుచ్చుకుని వెళ్లిపోతాడు. నిజంగా ఆదరించదగిన వ్యక్తి. తెలిసిన మరొకరికి పరిచయం చెయ్యమని కోరాడు. నీకు రాస్తున్నాను. వీలైన సాయం చేయమని కోరుతున్నాను.'

రవీంద్ర ఉత్తరం చదవడం ముగించి అర్జునుడి వంక చూసి – 'కూర్చోండి' అన్నాడు.

అర్జునుడు కూర్చోలేదు. తల ఊపి – 'ఫరవాలేదు లెండి' అన్నాడు.

రవీంద్ర – ఇప్పుడే వస్తానని బైటికి వెళ్ళాడు.

కొద్ది నిముషాలలో గది బయట నలుగురైదుగురు చేరారు. వారిలో వారు ఏదేదో మాట్లాడుకున్నారు. తర్వాత అందరూ కలిసి హెడ్మాస్టరు దగ్గరికి వెళ్లారు.

హెడ్మాస్టరు మంచివాడు.

వారు చెప్పింది సావధానంగా విన్నాడు. ఉత్తరం చదివాడు. తర్వాత కళ్లజోడు తీసి బల్లమీద ఉంచి కాసేపు ఆలోచించాడు. ఏమనుకున్నాడో ఏమో 'సరే' అన్నాడు ముందు.

ఆ తర్వాత 'ఈ ఉత్తరం నమ్మాలికదా మనం. కానివ్వండి' అన్నాడు.

ఆ వెంటనే నోటీసు తయారైంది.

చివరి పీరియడ్ రద్దు. స్కూలుకు ఒక విలువిద్యా ప్రవీణుడు వచ్చాడు. తన విద్య ప్రదర్శిస్తాడు.

రవీంద్ర టీచర్లందరినీ కలుసుకున్నాడు. వారికి చెప్పవలసింది చెప్పాడు. మొత్తానికి విద్యా ప్రదర్శనకు రంగం సిద్ధం అయింది.

అర్జునుడు తన సరంజామా గదిలోకి చేరవేశాడు. ఆ తర్వాత ఒక మూల బాసింపట్టు వేసుకుని కన్ను మూసుకుని కూర్చున్నాడు.

గదిలో ఎవరూ లేరు. కిటికీలోనుంచి శుభ్రవాయువు వీస్తున్నది. గుండెలనిండా శ్వాసపీల్చి నిలిపి ఉంచాడు. అరనిముషం... ఒక్క నిముషం... రెండు నిముషాలు. అతని శరీరం ఉక్కుకడ్డీలా తయారైంది. మూడు నిముషాల తర్వాత శ్వాస వదలి శరీరాన్ని విదిలించి లేచి నిలుచున్నాడు.

అంతలో అతనికి ఆకలి అనిపించింది. ఎప్పుడో ఏదో బస్టాండులో ఉదయం తిన్న రెండు ఇడ్లీలు... ఇందాకటి టీ.... ఇప్పుడు మూడు గంటలు కావస్తున్నది.

అతడు గదిలోకి వచ్చిన ఒక టీచరును సమీపించి – 'అయ్యా ! దగ్గరలో తినడానికేమయినా దొరుకుతుందా ? పొద్దుటినుంచీ వస్తున్నాను' అన్నాడు. అర్జునుడు అడిగిన తీరుకు ఆ వ్యక్తి చలించిపోయాడు.

'మీరు కూర్చోండి. నేను తెప్పిస్తాను' అంటూ ఆయన ఫ్యూన్‌ను పిలిచి అయిదు నిముషాలలో తినేందుకు ఏదో తెప్పించాడు.

అర్జునుడు ఆవురావురుమంటూ తినేసి కడుపు నిండా నీళ్లు తాగి ఆ వ్యక్తివంక తిరిగి నమస్కరించాడు. కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా 'లోకంలో మంచితనం ఇంకా బతికేవుంది' అని గొణుక్కున్నాడు.

మూడు గంటల పదిహేను నిముషాలకు స్కూలు ఆవరణలో వేదిక ముందు అన్ని క్లాసుల విద్యార్థులూ బిలబిలలాడుతూ సమావేశమైనారు. అంతా కోలాహలంగా ఉంది. ముందు వరుసలో టీచర్లు ఆసీనులైనారు. ఈ లోపల హెడ్మాస్టరు చేసిన హడావిడి ఇంతా అంతాకాదు.

ఈ ఒంటికంటివాడు ఏం చూపించబోతున్నాడు ? తాను రవీంద్ర మాట నమ్మి పొరపాటు చేయలేదుకదా అని మధనపడ్డాడు. ఆ మాట పైకి అనేశాడు కూడా. దాంతో రవీంద్రకు కూడా అనుమానం కలిగింది.

కానీ నా స్నేహితుడు అంత గట్టిగా రాస్తే నమ్మక చేసేదేముంది ? నమ్మి మనం చేయగలిగింది చేస్తున్నాం. ఆపైన అటూ ఇటూ అయితే మన ఖర్మ అనుకున్నాడు.

ప్రదర్శన ప్రారంభం అయింది. హెడ్మాస్టరు క్లుప్తంగా మాట్లాడి పిల్లలను నిశ్శబ్దంగా వుండమని కోరాడు.

రెండు నిముషాల నిశ్శబ్దం.... తర్వాత అర్జునుడు రంగప్రవేశం చేశాడు. సన్నగా, పొడవుగా, చువ్వలాగున్నాడు. జుట్టు నడినెత్తికి చేర్చి ముడివేసుకున్నాడు. వల్లెవాటు ధరించాడు. చేతిలో దృఢమైన విల్లు ధరించాడు. పది పదిహేను బాణాలు బల్లమీద పేర్చివుంచాడు. మైకు ముందుకు వచ్చి మాట్లాడడం ప్రారంభించాడు.

'నేను పేదవాణ్ణి, ఒంటరివాణ్ణి. ఈ ప్రపంచంలో నాది అనుకోదగిన ప్రాణి ఒక్కటి తప్ప ఏమీలేని వాణ్ణి. చదువు పెద్దగా లేదు. ఈ చేతిలో విల్లువుంది. ఈ బాణాలున్నాయి. ఇవే నా ఆస్తి, నా సర్వస్వం. వీటితోటే బతుకుతున్నాను.

నా బాణం గురి తప్పదు. నాకొక కన్నులేదు. మీరు చూస్తునే వున్నారు. నేనెన్నడూ ఎవరినీ యాచించలేదు. ఎవరి ముందూ దేహి అని చెయ్యిజాపలేదు.

నా తం[డ్రి] నియమనిష్ఠలతో బతికిన ధర్మాత్ముడు. ఆయన నాకేమీ ఇచ్చి పోలేదు. గొప్ప భక్తుడు. దైవ ధ్యానం చేస్తూనే ప్రాణం విడిచిన పుణ్యాత్ముడు. మన పెద్దలు మనిషి ఎట్లా బతకాలో ఎట్లా చావాలో కూడా చెప్పారు. అనాయాసేన మరణం అన్నారు. వినాదైన్యేన జీవనం అన్నారు. అట్లాగే బతికాను నేను.

నా ఒక్క పొట్టకోసం అయితే ఇంత తాపత్రయ పడను. కూలినాలి చేసుకుని అయినా బతికేవాణ్ణి. కానీ ఒక్క చిన్న బంధం మిగిలింది. విచిత్రమైన బంధం. నాకిక ఎంతో కాలం బతకాలని లేదు. బతక నని తెలుసుకూడా. ఇంతవరకు నా కర్తవ్యం నేను సజావుగానే నెరవేర్చాను.'

ఇలా మాట్లాడి ఉన్నట్టుండి వింటినారి మోగించాడు. మైకులో ఆశబ్దం ఉరుములాగా వినబడినలు వైపుల ప్రతిధ్వనించింది.

అందరూ ఉత్కంఠతో చూస్తున్నారు.

ఇక అర్జునుడి విజృంభణ ప్రారంభమైంది. చిత్ర విచిత్ర విన్యాసాలు, ధనుర్బాణాలతో అద్భుతాలు చేశాడు. బాల ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. పెద్దలు అబ్బురపడ్డారు.

ఇంతటి నైపుణ్యంకల వ్యక్తి నివురుగప్పిన నిప్పులాగా, మరుగునపడిన మాణిక్యంలాగా అనామకంగా వుండిపోవడమేమి టని బాధపడ్డారు.

హెడ్మాస్టరు అద్భుతరసంలో మునకలు వేసి ప్రదర్శన పూర్తి అయిన తర్వాత విద్యార్థులనుద్దేశించి మరునాడు స్కూలుకు వచ్చేటప్పుడు ఎవరికీ తోచిన విరాళాలు వారు తీసుకువచ్చి ఇవ్వండని ప్రకటించాడు.

ప్రదర్శన నలభై నిముషాలు పైగా సాగింది. అంతా అయిపోయాక అర్జునుడు అందరికీ సమస్కరించి వేదిక దిగి వెనుకకు వెళ్లి ఒక్క నిముషం సేపు గోడకానుకుని విగ్రహంలాగా నిలబడిపోయాడు ఆయాసంతో ఒగర్చుతూ. ఉన్నట్టుండి నోరంతా చేదుగా, వగరుగా అయిపోయింది. తుండు అడ్డం పెట్టుకుని దగ్గును ఆపుకునేందుకు ప్రయత్నించాడు. ఆ మేరకు తెల్లని తుండు ఎర్రగా రక్తసిక్తమైంది.

ఇవతల రవీంద్ర ఎంతో సంబరపడిపోతున్నాడు. తోటివారు చుట్టూ చేరి తనను అభినందించడంతో అతడు పొంగిపోయాడు. మొదట్లో తన మిత్రుడి ఉత్తరం చూసి నమ్మకంతో తన ప్రయత్నం తాను చేసినా తర్వాత హెడ్మాస్టరు వాలకం, ఆయన సణుగుడు చూసి అతడు భయపడినమాట వాస్తవం.

ముక్కు మొహం తెలియని ఈ ఒంటికంటి మనిషిని నమ్మామే, అతడు వట్టి ప్రగల్భాల మనిషి కాదుగదా? అని అనుమానించినదీ వాస్తవమే.

లోకంలో ఉత్తుత్తి గొప్పలు చెప్పుకునే వారి సంఖ్య తక్కువేమీ కాదు, కొండను తీసుకువెళ్లి అవతల పడేసి వస్తానని వెనకటికి ఎవడో అన్నట్టు బొత్తిగా పనికిమాలిన వ్యర్థులు కూడా గొప్పలు చెప్పుకుని బ్రతికే రోజులివి. కానీ ప్రదర్శన పూర్తయ్యాక మాత్రం రవీంద్రకు మహానందం కలిగింది. ఈ వ్యక్తి నిజంగా అసాధారణుడని నమ్మకం

కలిగింది. తాను అతనికి చేయవలసిన సాయం మరింత చేయాలని కూడా అనుకున్నాడతడు.

అందర్నీ తప్పించుకుని రవీంద్ర అర్జునుడి కోసం వెతికాడు. వెనక ఎక్కడో మారుమూల గోడకానుకుని నిలబడి గట్టిగా శ్వాస విడుస్తున్న అర్జునుణ్ణి వెదికి పట్టుకుని 'ఇక్కడున్నారామీరు ?' అంటూ వచ్చాడు. అర్జునుడు నవ్వాడు.

'ఈ పూటకు మా ఇంట్లో వుండాలి మీరు. భోజనం చేసి పడుకోండి. ఉదయమే స్కూలుకు బయల్దేరి వద్దా. 'ఇద్దరమూ' అన్నాడు.

అర్జునుడు నెమ్మదిగా 'మీకెందుకు శ్రమ ? ఒక్క పూటకు ఎక్కడ నడుం వాల్చినా సరిపోతుంది' అన్నాడు.

రవీంద్ర వినిపించుకోలేదు. పట్టుబట్టి అర్జునుణ్ణి సరంజామాతో సహా తన ఇంటికి తీసుకువెళ్లాడు. చిన్నదే అయినా ముచ్చటైన ఇల్లు. ముందు కొంచెం ఖాళీ స్థలం. పూలమొక్కలు... చిన్నవరండా. టీపాయ్ చుట్టూ నాలుగైదు కుర్చీలు. చిన్నవే అయినా నాలుగు గదులు. వీరిద్దరూ లోపలికి వెళుతుండగానే 'నాన్నా' అంటూ అయిదారేళ్ల పసిపిల్ల ఎదురువచ్చింది.

రవీంద్ర ఆ పిల్ల నెత్తుకుని లోపలికి వెళ్లాడు. లోపలి గదిలోకి వెళ్లగానే అర్జునుడు తన పెద్ద తోలుసంచిని గోడకానించి వుంచి ఒక పక్క అణకువగా నిలబడ్డాడు. అతని చూపు ఆ పసిపిల్లమీద నిలిచింది. ఆ పిల్ల అర్జునుణ్ణే కళ్లార్పకుండా చూస్తూ నిలబడింది. ఉన్నట్టుండి నవ్వింది. అర్జునుడు మురిసి పోయాడు. చేతులు చాపాడు.

ఒక్క అడుగు ముందుకువేసి ఆగిపోయింది. అర్జునుడు 'రా..రా...నీ పేరేమిటమ్మాయీ ?' అని అడిగాడు.

'సుమతి' అని సమాధానం.

అర్జునుడు ఆ పిల్ల దగ్గరగా వచ్చి నేలమీద కూర్చుని 'చిన్నప్పుడు మా అమ్మాయి కూడా అచ్చు నీలాగే వుండేది' అన్నాడు.

'నాలాగానా ?' అన్నదా పిల్ల కళ్లు పెద్దవిచేసి. 'అవును. అచ్చుగుద్దినట్టు నీలాగే వుండేది' 'ఇప్పుడెక్కడుంది ?'

'ఉంది... దూరంగా ఎక్కడో'

రవీంద్ర భార్యతో వచ్చాడు.

'కిందకూర్చున్నారేమిటి ?' అన్నదామె నెమ్మదిగా. అర్జునుడు లేచాడు.

రవీంద్ర తన భార్యను చూపించి 'మా ఆవిడ' అని పరిచయం చేశాడు. తర్వాత మా అమ్మాయి. ఉత్త అల్లరి పిల్ల. ఒక్కతే కదా అందువల్ల గారాబం. ఏమంటున్నదేమిటి? 'అన్నాడు.'

సుమతి 'నాన్నా ! వీళ్ల అమ్మాయి చిన్నప్పుడు నాలానే వుండేదిట' అన్నది.

రవీంద్ర నవ్వాడు.

అర్జునుడు 'అవునండీ ! మా భాను చిన్నప్పుడిలాగే వుండేది' అన్నాడు.

'ఇ...ంతేన్నేళ్లు ఆ పిల్లకు ?' అని అడిగాడు రవీంద్ర.

'పందొమ్మిది అనుకుంటాను.'

'ఎక్కడుంది ? మీ ఊళ్లోనా ?'

అర్జునుడు నిట్టూర్చాడు. 'నా ఊరేదీ ఇప్పుడు లేదు. ఊరు వదిలేసినట్టే. ఏదో పాత కొంప మాత్రం వుంది. ఊళ్లమీద పడి బతుకుతున్నాను.'

ఇంతలో ఆ ఇల్లాలు టీ తెచ్చి ఇచ్చింది ఇద్దరికీ.

అర్జునుడు టీ తాగుతూ వుండి వుండి మాట్లాడాడు. 'ఊరు వదిలేసి చాలా కాలమైంది. ఎప్పుడో బుద్ధి మళ్లినప్పుడు వెళ్లడమే. ఒక్క పసిపిల్ల కోసం బతికాను. దానికొక తోవ చూపించడం కోసం బతికాను' అన్నాడు.

తర్వాత కాస్సేపాగి 'ఇప్పుడా దిగులూ తీరింది. నిశ్చింతగా వున్నాను' అన్నాడు.

ఆనాడు రాత్రి ముందు గదిలో చాపమీద పడుకుని నిద్రపోయాడు.

కాసేపు బాగానే నిద్రపట్టింది కానీ అర్ధరాత్రివేళ నిద్ర చెదిరింది.

నిద్రలో కల.

కలలో కాస్సేపు యుద్ధరంగం. ప్రేలుళ్లూ, మోతలూ, విమానాల హోరుతో చెవులు చిల్లులు పడిపోతున్నాయి. అంతలో ఒక వ్యక్తి కేవలం నీడలా గున్నవాడు చేతిలో తుపాకీతో పరుగెత్తుతున్నాడు. ఎత్తయిన ఇసుక దిబ్బ వున్నట్టుంది. ఆ నీడ ఒక చేత్తో గుండెపట్టుకుని నెమ్మదినెమ్మదిగా నేలమీదికి ఒరిగిపోయింది. తర్వాత హోరుగాలి వీచింది. ఆ నీడ ఇసుకలో కూరుకుపోయింది.

అర్జునుడు ఉలిక్కిపడి లేచాడు. మొహం అంతా చెమటపట్టింది.

గొంతు ఎండుకుపోయినట్టనిపించింది. మొహం తుడుచుకుంటూ కిటికీలోని నీళ్లు అందుకుని గ్లాసులో పోసుకుని గటగట తాగాడు.

బయట అంతా నిశ్శబ్దంగా వుంది. అతడు మళ్లీ మొహం తుడుచుకుని పడుకున్నాడు. మళ్లీ కాస్సేపటికి కలత నిద్రలో కల.

ఒక గది. లోపల మసక వెలుతురు. కిటికీ ఒకటి అయితే వున్నది కానీ అది చాలా ఎత్తున వుంది. కిటికీ అవతల ఎక్కడో సూర్యుడస్తమిస్తున్నాడు. ఆ వైపు ఆకాశం అంతా ఎర్రగా రక్తసిక్తమైన వస్త్రం వలె వుంది.

గదిలో గోడపక్కన మంచం మీద ఒకనీడ, ఆ పక్కనే మరో చిన్న నీడ. అంతలో ఆగదిలోకి మరో చిన్ననీడ వచ్చింది నెమ్మదిగా. అదితానే. తాను వెళ్లి మంచం పక్కనే మోకాళ్లమీద కూర్చున్నాడు. మంచంలోని నీడ ఏదో మాట్లాడింది. తర్వాత ఏడ్చింది. చిన్న నీడను తనకు అందించింది. తర్వాత చచ్చిపోయింది.

అతడంతలో మేలుకున్నాడు. మనసంతా వికలమైంది. లేచి కూర్చున్నాడు కాస్సేపు. అంతలో తెల్లవారింది.

రవీంద్ర తొమ్మిది గంటలకల్లా తయారైవచ్చి 'వెళ్దామా ?' అన్నాడు.

కలిగింది. తాను అతనికి చేయవలసిన సాయం మరింత చేయాలని కూడా అనుకున్నాడతడు.

అందర్నీ తప్పించుకుని రవీంద్ర అర్జునుడి కోసం వెతికాడు. వెనక ఎక్కడో మారుమూల గోడకానుకుని నిలబడి గట్టిగా శ్వాస విడుస్తున్న అర్జునుణ్ణి వెదికి పట్టుకుని 'ఇక్కడున్నారామీరు ?' అంటూ వచ్చాడు. అర్జునుడు నవ్వాడు.

'ఈ పూటకు మా ఇంట్లో వుండాలి మీరు. భోజనం చేసి పడుకోండి. ఉదయమే స్కూలుకు బయల్దేరి వద్దా. 'ఇద్దరమూ' అన్నాడు.

అర్జునుడు నెమ్మదిగా 'మీకెందుకు శ్రమ ? ఒక్క పూటకు ఎక్కడ నడుం వాల్చినా సరిపోతుంది' అన్నాడు.

రవీంద్ర వినిపించుకోలేదు. పట్టుబట్టి అర్జునుణ్ణి సరంజామాతో సహా తన ఇంటికి తీసుకువెళ్లాడు. చిన్నదే అయినా ముచ్చటైన ఇల్లు. ముందు కొంచెం ఖాళీ స్థలం. పూలమొక్కలు... చిన్నవరండా. టీపాయ్ చుట్టూ నాలుగైదు కుర్చీలు. చిన్నవే అయినా నాలుగు గదులు. వీరిద్దరూ లోపలికి వెళుతుండగానే 'నాన్నా' అంటూ అయిదారేళ్ల పసిపిల్ల ఎదురువచ్చింది.

రవీంద్ర ఆ పిల్ల నెత్తుకుని లోపలికి వెళ్లాడు. లోపలి గదిలోకి వెళ్లగానే అర్జునుడు తన పెద్ద తోలుసంచిని గోడకానించి వుంచి ఒక పక్క అణకువగా నిలబడ్డాడు. అతని చూపు ఆ పసిపిల్లమీద నిలిచింది. ఆ పిల్ల అర్జునుణ్ణే కళ్లార్పకుండా చూస్తూ నిలబడింది. ఉన్నట్టుండి నవ్వింది. అర్జునుడు మురిసి పోయాడు. చేతులు చాపాడు.

ఒక్క అడుగు ముందుకువేసి ఆగిపోయింది. అర్జునుడు 'రా..రా..నీ పేరేమిటమ్మాయీ ?' అని అడిగాడు.

'సుమతి' అని సమాధానం.

అర్జునుడు ఆ పిల్ల దగ్గరగా వచ్చి నేలమీద కూర్చుని 'చిన్నప్పుడు మా అమ్మాయి కూడా అచ్చు నీలాగే వుండేది' అన్నాడు.

'నాలాగానా ?' అన్నదా పిల్ల కళ్లు పెద్దవిచేసి. 'అవును. అచ్చుగుద్దినట్టు నీలాగే వుండేది' 'ఇప్పుడెక్కడుంది ?'

'ఉంది... దూరంగా ఎక్కడో'

రవీంద్ర భార్యతో వచ్చాడు.

'కిందకూర్చున్నారేమిటి ?' అన్నదామె నెమ్మదిగా. అర్జునుడు లేచాడు.

రవీంద్ర తన భార్యను చూపించి 'మా ఆవిడ' అని పరిచయం చేశాడు. తర్వాత మా అమ్మాయి. ఉత్త అల్లరి పిల్ల. ఒక్కతే కదా అందువల్ల గారాబం. ఏమంటున్నదేమిటి? 'అన్నాడు.'

సుమతి 'నాన్నా ! వీళ్ల అమ్మాయి చిన్నప్పుడు నాలానే వుండేదిట' అన్నది.

రవీంద్ర నవ్వాడు.

అర్జునుడు 'అవునండీ ! మా భాను చిన్నప్పుడిలాగే వుండేది' అన్నాడు.

'ఇప్పుడెన్నేళ్లు ఆ పిల్లకు?' అని అడిగాడు రవీంద్ర.

'పందొమ్మిది అనుకుంటాను.'

'ఎక్కడుంది? మీ ఊళ్లోనా?'

అర్జునుడు నిట్టూర్చాడు. 'నా ఊరేదీ ఇప్పుడు లేదు. ఊరు వదిలేసినట్టే. ఏదో పాత కొంప మాత్రం వుంది. ఊళ్లమీద పడి బతుకుతున్నాను.'

ఇంతలో ఆ ఇల్లాలు టీ తెచ్చి ఇచ్చింది ఇద్దరికీ.

అర్జునుడు టీ తాగుతూ వుండి వుండి మాట్లాడాడు. 'ఊరు ఒదిలేసి చాలా కాలమైంది. ఎప్పుడో బుద్ధి మళ్లినప్పుడు వెళ్లడమే. ఒక్క పసిపిల్ల కోసం బతికాను. దానికొక తోవ చూపించడం కోసం బతికాను' అన్నాడు.

తర్వాత కాస్సేపాగి 'ఇప్పుడా దిగులూ తీరింది. నిశ్చింతగా వున్నాను' అన్నాడు.

ఆనాడు రాత్రి ముందు గదిలో చాపమీద పడుకుని నిద్రపోయాడు.

కాసేపు బాగానే నిద్రపట్టింది కానీ అర్థరాత్రివేళ నిద్ర చెదిరింది.

నిద్రలో కల.

కలలో కాస్సేపు యుద్ధరంగం. ప్రేలుళ్లూ, మోతలూ, విమానాల హోరుతో చెవులు చిల్లులు పడిపోతున్నాయి. అంతలో ఒక వ్యక్తి కేవలం నీడలా గున్నవాడు చేతిలో తుపాకీతో పరుగెత్తుతున్నాడు. ఎత్తయిన ఇసుక దిబ్బ వున్నట్టుంది. ఆ నీడ ఒక చేత్తో గుండెపట్టుకుని నెమ్మదినెమ్మదిగా నేలమీదికి ఒరిగిపోయింది. తర్వాత హోరుగాలి వీచింది. ఆ నీడ ఇసుకలో కూరుకుపోయింది.

అర్జునుడు ఉలిక్కిపడి లేచాడు. మొహం అంతా చెమటపట్టింది.

గొంతు ఎండుకుపోయినట్లనిపించింది. మొహం తుడుచుకుంటూ కిటికీలోని నీళ్లు అందుకుని గ్లాసులో పోసుకుని గటగట తాగాడు.

బయట అంతా నిశ్శబ్దంగా వుంది. అతడు మళ్లీ మొహం తుడుచుకుని పడుకున్నాడు. మళ్లీ కాస్సేపటికి కలత నిద్రలో కల.

ఒక గది. లోపల మసక వెలుతురు. కిటికీ ఒకటి అయితే వున్నది కానీ అది చాలా ఎత్తున వుంది. కిటికీ అవతల ఎక్కడో సూర్యుడస్తమిస్తున్నాడు. ఆ వైపు ఆకాశం అంతా ఎర్రగా రక్తసిక్తమైన వస్త్రం వలె వుంది.

గదిలో గోడపక్కన మంచం మీద ఒకనీడ, ఆ పక్కనే మరో చిన్న నీడ. అంతలో ఆగదిలోకి మరో చిన్ననీడ వచ్చింది నెమ్మదిగా. అదితానే. తాను వెళ్లి మంచం పక్కనే మోకాళ్లమీద కూర్చున్నాడు. మంచంలోని నీడ ఏదో మాట్లాడింది. తర్వాత ఏడ్చింది. చిన్న నీడను తనకు అందించింది. తర్వాత చచ్చిపోయింది.

అతడంతలో మేలుకున్నాడు. మనసంతా వికలమైంది. లేచి కూర్చున్నాడు కాస్సేపు. అంతలో తెల్లవారింది.

రవీంద్ర తొమ్మిది గంటలకల్లా తయారైవచ్చి 'వెళ్దామా?' అన్నాడు.

అర్జునుడు [illegible] ఊపి లేచాడు. గుమ్మంలో నిలబడి వున్న ఆమెకు నమస్కరించాడు.

'వెళ్లొస్తానమ్మా' అన్నాడు.

'చల్లని తల్లి. అన్నం పెట్టి ఆదరించింది' అనుకున్నాడు.

ఇద్దరూ స్కూలుకు వెళ్లేసరికి మొదటి గంట కొట్టారు. హెడ్మాస్టరు గదిలో కాస్సేపు కూర్చున్నారు. ఆయన ఎంతో హుషారుగా ఆనందంగా మాట్లాడాడు. తాను మరొకరికి అర్జునుణ్ణి, అతని ప్రతిభను పరిచయం చేస్తూ ప్రోత్సహించవలసిందని అర్థిస్తూ రాసిన ఉత్తరాన్ని అందించాడు. అప్పటికే ఉపాధ్యాయులు విరాళంగా ఇచ్చిన మొత్తం ఒక కవరులో అక్కడ వుంది.

తర్వాత హెడ్మాష్టరు అర్జునుణ్ణి ఒక ప్యూన్‌ను వెంటబెట్టుకుని స్వయంగా అన్ని క్లాసులకు వెళ్లాడు. ప్యూను సంచి పట్టుకుని నడిచాడు. పిల్లలు అప్పటికప్పుడు ఆసంచిలో డబ్బు వేశారు.

ఆ కార్యక్రమం ముగిశాక మళ్లీ హెడ్మాస్టరు గదికి వెళ్లారు. ప్యూను మొత్తం డబ్బు తీసి లెక్కపెట్టి ఒకచోట చేర్చాడు. అది అంతా హెడ్మాష్టరు అర్జునుడి చేతికి అందించాడు.

అర్జునుడు వినయంగా దాన్ని అందుకుని ఆయనకు నమస్కరించాడు.

స్కూలు ఆవరణ దాటి వచ్చేవరకు రవీంద్ర వెంటవచ్చాడు.

ఆ తర్వాత ఆగి తానొక కవరు అర్జునుడికి అందించి 'ఈ అడ్రసుకు వెళ్లండి. అది పెద్ద ఆఫీసు'. మా స్నేహితుడికి ఇవ్వండి. మిగిలిన ఏర్పాట్లు అతనే చూస్తాడు. అన్నాడు.

అర్జునుడికి కళ్లనీళ్ల పర్యంతం అయింది. రవీంద్ర చేతులు పట్టుకుని ఒక్క క్షణం ఆగి నమస్కరించాడు.

'మీ మేలు మరిచిపోను' అన్నాడు.

తర్వాత పెద్ద పెద్ద అంగలు వేస్తూ నడిచిపోయాడు. అరగంట తర్వాత దక్షిణంవైపు వెళ్లే రైలులో వున్నాడు.

*****

'ఎవరిదీ ?' అంటూ తలుపు తీశాడు దాశరథి. పూర్తిగా తెల్లవారలేదు. పక్షుల కిలకిలరావాలు మాత్రం మొదలైనాయి.

ఎదురుగా పంచలోని వ్యక్తిని గుర్తుపట్టలేక 'ఎవరిదీ ?' అన్నాడు దాశరథి మళ్లీ.

'నేను బావా శంతన్‌ను' అన్నాడతడు. బరువైన సూట్‌కేసు కింద ఉంచి, భుజాన వున్న తోలుసంచి కూడా దింపి నవ్వుతూ. 'గుర్తుపట్టలేదా బావా నన్ను ?' అన్నాడు. శాంతమ్మ లోపలి నుంచి వచ్చింది.

'చూడక్కా ! బావ నన్ను గుర్తుపట్టలేకపోతున్నాడు' అంటూ అతడు లోపలికి వచ్చాడు.

శాంతమ్మ అతన్ని గుర్తించి 'ఎక్కడి నుంచి ? ఏమిటి కథ? ఉత్తరం పత్తరం లేకుండా దిగావే ?' అని భర్తవైపు తిరిగి 'మా తమ్ముడండీ శంతన్ .... శంతన్‌కుమార్. అయినా

మీరు వాణ్ణి నింపాదిగా చూసిందెప్పుడు లెండి. ఇటీవల రాకపోకలే లేవు. ఒక కడుపున పుట్టిన వాళ్ళే దాని దారి దానిదే. వీడు మా పిన్నమ్మ కొడుకు' అని చెప్పింది.

దాశరథికి గుర్తువచ్చింది. ఇతను చాలా చిన్నవాడప్పటికి. శాంతమ్మ తల్లి పోయిన తర్వాత ఆమె తండ్రి వేరే వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత కొద్ది సంవత్సరాలకు తమ పెళ్లి అయింది. ఆపైన ఎప్పుడో ముసలాయన, ముసలమ్మలు పోయినప్పుడు తప్ప అంతగా రాకపోకలూ లేవు.

దాశరథి లోపలికి వచ్చాడు. అప్పటికే భాను ఎప్పుడు నిద్ర లేచిందో, ఎప్పుడు స్నానాదికాలు పూర్తిచేసుకుందో నీళ్ల బకెట్ తీసుకుని వాకిలి పనిచేసేందుకు వెళుతున్నది.

శంతన్ తీరికగా అక్కగారి ముందు కూర్చుని మాట్లాడుతున్నాడు.

దాశరథి వింటు కూర్చుండిపోయాడు. ఈ శంతన్ కుమార్ మంచి వయసులో వున్నాడు. దర్జాగా వున్నాడు. గలగల మాట్లాడుతున్నాడు. శాంతమ్మ ఉన్నట్టుండి 'ఇప్పుడేం చేస్తున్నావురా ?' అని అడిగింది.

అతడేదో చెప్పాడు. ఊళ్లు తిరిగే రహస్యమైన, ఇతరులకు చెప్పరాని ఉద్యోగం. బహుశా రహస్య పోలీసుశాఖలో. తల్లి, తండ్రిపోయాక అతని మేనమామలు చేరదీశారు.

డిగ్రీ చివరి సంవత్సరం వారి అండదండలతోనే వెళ్లదీశాడు. తర్వాత కొంతకాలం పాటు చిన్న చిన్న ఉద్యోగాలు చేశాడు. తర్వాత కల్పవృక్షంలాటి ఈ ఉద్యోగం దొరికింది. మంచి జీతం, పైరాబడి, చేతి నిండా డబ్బు.

దాశరథి అతన్ని అంచనా వేస్తున్నాడు. వసపోసిన పిట్టలాగున తెగవాగుతున్న ఆ యువకుణ్ణిగురించి ఆలోచిస్తున్నాడు. అతని డాబుససరి మాటలను శ్రద్ధగానే వింటున్నాడు.

శంతన్ అంతలో 'పిల్లలేరి ?' అని అడిగాడు.

గుమ్మంలో నిలబడి నిద్రవీడని కళ్లతో చూస్తున్నారు అన్నాచెల్లెళ్లిద్దరూ.

శంతన్ 'రండర్రా ఇటు. కమాన్' అన్నాడు.

సంచిలో నుంచి ఏవేవో తీసి వారి కిచ్చాడు.

'అక్కా ! ఇది నీకు' అంటూ ఒక ఖరీదైన చీరతీసి శాంతమ్మకిచ్చాడు.

ఆమె 'ఇప్పుడివన్నీ ఎందుకురా ?' అంటూనే అందుకుంది. ఆనందించినట్టు కనిపించింది కూడా.

'బావగారికి' అంటూ అతడొక వాచీ తీసి దాశరథి దగ్గరగా వచ్చి బలవంతంగా అతని ముంజేయి అందుకుని తొడిగాడు.

దాశరథి ఏదో నసిగాడే కానీ ఏమీ అనలేకపోయాడు.

అంతలో భాను వాకిలిపని ముగించుకుని లోపలికి వచ్చింది.

శంతన్ ఆ అమ్మాయిని వింతగా చూస్తూ 'ఇదెవరు ?' అన్నాడు ముందు. తర్వాత

మళ్లీ సర్థుకుని "ఆ అమ్మాయి ఎవరు ?' అని అడిగాడు.

'మీ బావగారికి బాగా ముఖ్యులైన ఒక ఫ్రెండు కూతురు' అని చెప్పింది శాంతమ్మ.

శంతన్ అదొక రకంగానవ్వి 'ఓహో' అని మాత్రం అన్నాడు.

ఆనాటి నుంచీ ఇంట్లో శంతన్‌దే హడావిడి.

ఉదయమే లేచి గలగల మాట్లాడుతూ ఇల్లంతా తానే అయి తిరిగేవాడు. పిల్లలను సాయంకాలంపూట వెంట వేసుకుని ఊరంతా తిప్పేవాడు. వాళ్లకు రకరకాల వస్తువులు కొనిపెట్టేవాడు. డబ్బు మంచి నీళ్లలా ఖర్చుపెట్టేవాడు. వాళ్లు కూడా మామయ్యా మామయ్యా అంటూ అతనికి బాగా చేరువైపోయారు.

భాను మాత్రం మౌనంగా తన పనులు తను చేసుకునేది. శంతన్ ఎదురు పడితే తప్పించుకు తిరిగేది.

అతను అప్పుడప్పుడు భానును మాటల్లోకి దింపడానికి ప్రయత్నించేవాడు.

అప్పుడు ఒకసారి శాంతమ్మే కలగజేసుకుని 'ఆ అమ్మాయి మాట్లాడదు నాయనా! మూగది' అని చెప్పింది.

అప్పుడు మాత్రం శంతన్ ఆశ్చర్య పోయాడు. కానీ లోలోపల ఏమను కున్నాడోకానీ తర్వాత మాటి మాటికీ ఆమెను పూసుకుని తిరగడం, తనకేమి కావలసివచ్చినా భానూ భానూ అంటూ పిలవడం సాగించాడు.

దాశరథి అంతా గమనిస్తూనే వున్నాడు. కొంచెం చిరాకుగానే వున్నా పైకి ఏమనడానికీ వీలులేక ఊరుకుండిపోయాడు.

ఒకనాడు పిల్లలింట్లో లేని మధ్యాహ్నవేళ...దాశరథి ఆఫీసులో పనిలో మునిగివున్న వేళ శాంతమ్మ ఏదో పనిమీద ఎక్కడికో వెళ్లినవేళ నిద్ర లేచాడు. ఎవరూ లేకపోవడం గ్రహించి వంటగది లోకి వచ్చాడు.

భాను అప్పటికి కాఫీ ప్రయత్నంలో వుంది.

అతడు వెళ్లి చొరవగా ఆమె భుజం మీద చేయి వేశాడు.

ఆమె ఉలిక్కిపడి వెనుదిరిగింది. 'కాఫీ..కాఫీ..'అన్నాడు.

ఆమె మాట్లాడకుండా అదే ప్రయత్నంలో వున్నానన్నట్టు సైగ చేసింది. అతడు హఠాత్తుగా ఆమె చేయి పట్టుకున్నాడు.

అలా పట్టుకుంటాడని తెలిసినదానివలె భాను అతని చేతిని విదిలించి కొట్టింది. ఆమె విసురుకు చేతి మణికట్టు విరిగినంత బాధ కలిగింది. అతనికి మతి చెడినట్టయింది.

ఏమీ మాట్లాడకుండా ముందు గదిలోకి వెళ్లిపోయాడు.

కొన్ని నిముషాలలో భాను కాఫీ తీసుకువచ్చి మంచం పక్కనే వున్న స్టూలుమీద వుంచి వెళ్లిపోయింది.

అతడు కాఫీ తాగుతూ ఆలోచనలో పడ్డాడు. మణికట్టు దగ్గరమండుతున్నంత బాధ...

ఇన్నాళ్ళుగా అతనికి తెలిసిన వివరాల ప్రకారం ఈ పిల్ల దిక్కులేనిది.. ఒంటరిది.. తండ్రి వున్నాడు కానీ లేనివాడికిందనే లెక్క. ఇక్కడే వదిలి వెళ్లిపోయాడు. ఎక్కడున్నాడో, అసలున్నాడో లేదో కూడా తెలియదు.. చదువుసంధ్యలు పూజ్యం... పిల్లలు చెప్పిన వివరాలను బట్టి చదువు మీద ధ్యాసకూడా లేదు. కనీసం గడియారం చూసి టైము కనుక్కోడం అయినా ఎన్నిసార్లు వివరించినా పట్టుబడలేదు. బుట్టలో పడక పోతుందా ? అనుకున్నాడు.

ఈనాడు తనను విసిరికొట్టింది. అయినా అదేమి విసురు ! మణికట్టు విరిగినంతపని అయింది అనుకున్నాడు.

ఏం చూసుకుని ఈ దరిద్రురాలికింత మిడిసిపాటు ? అనికూడా అనుకున్నాడు.

తర్వాత అతని తీరు మారింది.

క్రమ క్రమంగా ఇతరులముందు ఆమెను గురించి వ్యాఖ్యలు చేయడం, ఎగతాళిగా మాట్లాడటం సాగించాడు.

చదువులేని మొద్దు.. కదలలేని ఎద్దు అనేవాడు. ఎర్రగా బుర్రగా అందంగా వుంటే సరా... చదువు లేకపోతే జన్మ వృధా అనేవాడు.

శాంతమ్మ మొదట్లో చిరాకుపడేది. తర్వాత నెమ్మది నెమ్మదిగా మందలించింది కూడా.

*****

దాశరథి పైకి ఏమీ అనలేక కోపాన్ని లోలోపలే అణుచుకునేవాడు.

ఆనాడు...

వసంత, భాను ఇద్దరూ రోడ్డుకు పక్కగా నడుస్తున్నారు. భాను చేతిలో సంచి... అందులో ఏవో వస్తువులున్నాయి.

మ్యాటనీ సినిమాలు వదిలినవేళ.. ఆఫీసు బంధి ఖానాలలోనుంచి ఉద్యోగి ప్రాణులు అలసిసొలసి బయటపడుతున్న వేళ...

రోడ్డు రద్దీగా వుంది.

వీరి వెనకనే ముగ్గురబ్బాయిలు నడుస్తున్నారు. కావాలని వీరి అడుగులలో అడుగులు వేస్తూ నడుస్తున్నారు.

ఒకసారి ఒకడి కాలు వసంతకు తగిలింది కూడా. ఆమె వెనుదిరిగి ఒకసారి చూసి వేగంగా అడుగులు వేసింది.

వెనుకనుంచి మాటలు వచ్చి తగులుతున్నాయి.

'బాగుందిరా' ఒకడు

'ఏం బాగుందిరా ?' మరొకడు.

'ఏం బాగుందీ ?' మూడోవాడి దీర్ఘం.

'చిన్నపిట్ట బాగుంది. పెద్దపిట్టకూడా బాగుంది. పిటపిటలాడుతున్నది.'

ఒకడు ఏదో పనికిమాలిన సినిమా పాట లంకించుకున్నాడు.

భాను ఒక్కసారి ఆగి వెనుదిరిగి చూసింది. వసంత భుజం మీద చెయ్యి వేసి దగ్గరగా తీసుకుని నడవటం సాగించింది.

వాళ్లలో ఒకడు సన్నగా ఈలవేశాడు.

భాను ఆగి వెనుదిరిగింది. కుడిచేతిలోని సంచి ఎడమచేతిలోకి మార్చుకుంది.

వసంతకు అంతవరకే తెలుసు.

క్షణంలో కళ్లముందు ఒక వింత జరిగినట్టయింది. ఆమె కళ్లు చెదిరిపోయాయి.

'ఏం జరిగింది ?' అనుకునే లోపల క్షణంలో సగంలో అంతా జరిగిపోయింది.

ఈల వేసినవాడు ముఖం కప్పుకుని కూలబడి పోతున్నాడు. బాధగా అరుస్తున్నాడు. మిగిలిన ఇద్దరూ స్థాణువుల్లా నిలబడిపోయారు. వాళ్లకూ జరిగిందేమిటో అర్థంకాలేదు.

క్షణాలలో చుట్టూ జనం మాత్రం పోగయినారు.

భాను అలాగే నిలబడింది తొణక్కుండా. వాడు మొహం కప్పుకుని విలవిల లాడిపోతున్నాడు. జనంలో ఒకాయన వాడి చేతులు తప్పించాడు. వాడి ముక్కు బద్దలైపోయి రక్తం ప్రవాహంగా కారుతున్నది.

అక్కడ చేరినవారికి పరిస్థితి అర్థమైంది. వారిలో ఒకాయన నవ్వుతూ 'బాగుంది.... బాగుంది' అన్నాడు.

తర్వాత మిగిలిన ఇద్దరినీ చూసి 'అట్లా నిలబడతారేమయ్యా ! ఇతని స్నేహితులేగా మీరు ? లేవదీసి ఏ డాక్టరు దగ్గరికయినా తీసుకుపొండి... ఆలస్యం చేస్తే ప్రమాదం... కాస్సేపు వుంటే ఏ పోలీసులో వస్తారు.... అప్పుడు మీ కథ ముదిరి పాకానపడుతుంది.' అన్నాడు.

వాళ్ళిద్దరూ బిక్కమొహాలు వేసుకుని తమ మిత్రుణ్ణి లేవదీశారు. చెరో రెక్కా పట్టుకుని. అతడు అతికష్టం మీద నిలబడి రుమాలు ముక్కుకద్దుకుని ఏడుస్తూ వారివెంట నడిచాడు.

ఆయన భానువంక మెచ్చుకోలుగా చూస్తూ తనూ తన దారిన వెళ్లిపోయాడు.

భాను ముందుకు కదిలింది.

వసంత 'ఏం చేశావు ?' అని అడిగింది వొణుకుతున్న కంఠంతో.

భాను కుడిచేయి పిడికిలి బిగించి చూపించింది. అంతే...

ఆ రాత్రి...

వసంతలో ఉద్వేగం తగ్గలేదు.

కేవలం తల్లి మాత్రమే వినేట్టుగా లోగొంతుకతో జరిగిందంతా చెప్పింది.

శాంతమ్మ బుగ్గలు నొక్కుకుని 'ఈ పిల్ల అంత పనిచేసిందా ?' అని మాత్రం అన్నది.

*****

అర్జునుడు బస్టాండ్‌లో సిమెంట్ బల్లమీద పడుకుని వున్నాడు.

పైన రేకులమీద చప్పుడు చేస్తూ వర్షం పడుతున్నది.

అర్ధరాత్రివేళ అయినా లైట్ల వెలుతురు... బస్సుల రద్దీ లేకపోవడంతో పైనుంచి వచ్చిపోయే బస్సులు కాస్సేపు ఆగి వెళ్లిపోవడం తప్ప ఏ అలజడి లేదు.

అర్జునుడు కలగంటున్నాడు.

.....అంతా చిమ్మచీకటి.... ఒకమూల ఎక్కడో కాస్త వెలుతురు...కనుచూపుమేర అంతటా ఒక మహార్ణవం... అలలు ఉధృతంగా పైకిలేస్తున్నాయి. ఆకాశంలో లోహవిహంగాల హోరు... కర్ణపుటాలు బద్దలు చేసేరొద... తలకు కొమ్మలూ రెమ్మలూ వున్న ఉక్కు శిరస్త్రాణాలు ధరించినవారి పరుగులు.. నేపథ్యంలో ఏడుపులు...మూలుగులు..

ఉన్నట్టుండి ఒక నీడ గుండె పట్టుకుని నీళ్లలోకి ఒరిగిపోతున్నది. క్షణాల్లో ఆ నీడను భయంకరమైన సుడిగుండం తన గుండెలలోకి లాక్కు పోయింది.

అర్జునుడు నిద్రలోనే మరోవైపు తిరిగి పడుకున్నాడు.

....ఈసారి ఒక గది.... మందపాటి వెలుతురు...గోడ పక్కన కుక్కిమంచంలో ఒక అస్థిపంజరం నీడ... ఆ పక్కన ఒక మూట... అస్థిపంజరం మరణిస్తున్నది. మూటను తన చేతికి అందిస్తున్నది...

అర్జునుడు ఉలిక్కిపడి లేచాడు.

కూర్చునికళ్లు నులుముకున్నాడు. పక్కనేవున్న తన పొడవాటి తోలుసంచిని పక్కకు జరుపుకున్నాడు. చుట్టూ ఎవరూ లేరు.

తానెక్కవలసిన బస్సు ఉదయం ఆరుగంటలు దాటిన తర్వాత కానీ రాదు. ఈలోపల ఇలా వేచి వుండకతప్పదు.

అతనికి అంతలో ఒక ముఖం గుర్తువచ్చింది. నిజానికి ఆ ముఖాన్ని తాను మరిచిపోయినదెన్నడు? ఎర్రని ఛాయ...చిరునవ్వులు చిందే ముఖం... సన్నని మీసం... కండలు తిరిగిన శరీరం... ఆ తర్వాత సహజంగానే మరో ముఖం... స్త్రీ సౌందర్యం అంతా పోతపోసినట్టున్న లేత తీగవంటి శరీరం... వెలుగులు చిమ్మే పెద్ద పెద్ద కళ్లు... నవ్వితే సొట్టలు పడే బుగ్గలు... పేదరికాన్ని పరమానందంగా భగవంతుడిచ్చిన వరంగా భావించి వున్నంతలో తృప్తిగా బ్రతికినజీవి ముఖం...

ఆ తర్వాత అతనికి భాను గుర్తుకువచ్చింది. చిన్నప్పటి నుంచి తన గుండెలమీద పెరిగిన పిల్ల... తన ఆరవప్రాణం.. లేత కాళ్లతో తన గుండెలమీద చిందులు వేసింది. తన చేతులు పట్టుకుని నడక నేర్చుకున్నది. తన మాటలు పాటలు విన్నది.

ఆ చిన్న ఊళ్లో చుట్టుపక్కలవారు ఆశ్చర్యపోయేవారు. కన్నతల్లి వుండివున్నా ఇంత చక్కగా పెంచదు! అనుకుని మురిసిపోయేవారు. తాను ఒక్కక్షణం కనబడకపోతే గుక్కపట్టి ఏడ్చేది. కొంచెం పెద్దయ్యాక తనకోసం కాలుగాలిన పిల్లిలా ఇంట్లోకి వాకిట్లోకి తిరిగేది. ఆ తర్వాత తాను గుండె దిటవుపరచుకుని బాధ్యత తెలిసి ప్రవర్తించాడు. ఎక్కడా ఏ లోపమూ చేయలేదు. అదే తనకు మిగిలిన తృప్తి.

'ఇప్పుడేం చేస్తున్నదో' అనుకున్నాడు ఆవులించి చిటికెవేసి.

అంతలోనే మళ్లీ ధైర్యంగా దాశరథి 'మంచివాడు... నేనంటే ప్రాణం.. దేవుడులాటివాడు... ఆమెకూడా మంచి ఇల్లాలు... ఆ దంపతులకు చిట్టి తల్లిని అప్పగించి జీవితంలోకెల్లా మంచిపనిచేశాను' అనుకున్నాడు.

అంతలో అతనికి దగ్గు వచ్చింది. ఆగకుండా దగ్గాడు. రెండు నిముషాల పాటు ఉక్కిరిబిక్కిరి అయినాడు. తర్వాత ఆయాసంతో వగర్చుతూ ఉండి పోయాడు.

తర్వాత లేచి వెళ్లి కాసిని మంచినీళ్లు తాగివచ్చి ఆ బల్లమీదనే, తన తోలుసంచి పక్కనే కూర్చున్నాడు.

చల్లని గాలి వీస్తున్నది. వర్షపు జల్లు కొంచెం తగ్గింది.

'ఇక ఇంతటితో కథ కంచికి' అనుకున్నాడు హఠాత్తుగా.

సాయంకాలం ఇవ్వబోయే ప్రదర్శన బహుశా చివరిది. ఆ తర్వాత ఈ ధనుర్బాణాలతో పనిలేదు అనుకున్నాడు.

ఆ తోలుసంచి నిమురుతూ 'ఇవి ఏమై పోతాయి ?' అని ప్రశ్నించుకున్నాడు.

అతనికి వింత అనిపించింది. చిన్నప్పుడు తన చిన్న ఊరూ, ఆ చెట్లూ, పొదలూ, ఆ స్నేహితులూ తప్ప ఏమీ ఎరుగడు. తండ్రిదంతా వేరే ప్రపంచం... ఆ ప్రపంచంలో తనకు ప్రవేశంలేదు. తల్లి ఎలాగూ లేదు. దాశరథి ఇల్లే తన ఇల్లుగా వుండేది.

ఆనాడు కంటికి తగిలిన దెబ్బకంటినే పోగొట్టింది. అయినా ఆ పిన్నవయసులో కూడా తాను ఎవరినీ ఏమీ అనలేదు. ఆ బాధా యాతనా ఏదో తానే అనుభవించాడు.

తన తండ్రికూడా పెద్దగా చలించలేదు. ప్రశాంతంగా 'ఏదో పొరపాటున జరిగిందంతే.. అంతా విధి లిఖితం... అలా జరగాలని రాసి పెట్టి వుంది... విధిని ఎవరూ తప్పించలేరు. శివాజ్ఞలేనిదే చీమ అయినా కుట్టదుకదా' ఇలా మాట్లాడాడు.

దాశరథి ఆ వయసులోనే తాను పెద్దపాపం చేశానని రోజుల తరబడి ఏడ్చాడు. తనకు జాలివేసింది కూడా. నువ్వేం కావాలని నా కన్ను పొడిచావా ? పొరపాటున తగిలిందంతే అనేవాడు.

కన్ను లొట్టపడిపోయిన తర్వాత ఒక కన్నువుంది అని సంతృప్తిచెందాడు. రెండు కళ్లూలేని పుట్టంధులు, దురదృష్టవంతులెందరు లేరు. వారికంటే నేను నయం కదా : అనుకున్నాడు. డీలాపడిపోలేదు. నిరుత్సాహం అసలేలేదు. మానవుడికి అసాధ్యమైన దేదీ లేదు అని మనసును పాషాణంగా మలుచుకుని ఈ అపూర్వమైన విద్యను సాధనచేశాడు. రెండు కళ్లూవున్నవాళ్లు ఎవరూ సాధించలేని మహత్తరమైన విద్యను సాధించాడు.

తెల్లవారింది... బస్టాండులో మామూలు అలజడి మొదలయింది.

అర్జునుడు లేచి వెళ్లి టీ మాత్రం తాగాడు.

బస్సు వచ్చింది. తన విల్లు బాణాల సంచిని సీటు కిందికి తోసి కూర్చున్నాడు.

బస్సు కదిలింది.

కిటికీ పక్కన కూర్చోవడం వల్ల హాయిగా వుంది. అయినా లోపలినుంచి ఏదో పొంగు. ఒక్కసారి బయటికి ఏమ్మేశాడు. రుమాలుతో నోరు తుడుచుకున్నాడు. ఆ రుమాలును తెల్లగా వున్న వైపుకు మడిచి చొక్కా జేబులో పెట్టుకున్నాడు.

'ఇవాళ్టి ప్రదర్శన బహుశా చివరిది' అనుకున్నాడు మళ్లీ.

ఎత్తయిన వేదికమీద మంత్రిగారి మహోపన్యాసం సాగుతున్నది. వేదికమీద ఇంకా పెద్దలు చాలామంది, విద్యావేత్తలూ ఆసీనులైవున్నారు. హాలు బయట పోలీసు బందోబస్తు మస్తుగా వుంది. ఉపన్యాసాల జోరు, ఇంకా ఎంతసేపు సాగుతుందో తెలియదు.

ఆ తర్వాత ధనుర్విద్యా ప్రదర్శన.

మంత్రిగారు తన పాత్ర ముగించి వేదికదిగి వెళ్లిపోవడానికి సిద్ధపడితే ఆయనతో పాటు చాలా మంది మందీమార్బలమూ కోలహలం చేస్తూ వెళ్లిపోతారు. అందువల్ల నిర్వాహకులను ప్రాధేయపడితే వారు మంత్రిగారికి సభా ప్రారంభానికి ముందే మనవిచేశారు. తర్వాత జరగబోయే ధనుర్విద్యా ప్రదర్శన కాస్సేపు తిలకించి వెళ్లవలసిందిగా అర్జునుడి తరపున అర్థించారు. ఆయనకూడా ఒంటి కంటి వ్యక్తి ధనుర్విద్య అనగానే విస్మయంతో అలాగే వుంటానని తల ఊపాడు.

ఏడుగంటల ప్రాంతంలో సభాకార్యక్రమం, సన్మాన కార్యక్రమం ముగిశాయి.

రంగస్థలం అంతా వెలిగిపోతున్నది. హాలంతా క్రిక్కిరిసి వున్న ప్రేక్షకులు నిశ్శబ్దంగా వుండవలసిందిగా మైకులో ప్రకటించారు.

అప్పుడు...

అర్జునుడు రంగప్రవేశం చేశాడు.

పాత పట్టుబట్ట గోచీ పోసి కట్టాడు. తల చుట్టూ ఒక సన్నని గుడ్డ చుట్టుకున్నాడు. పలుచని సన్నని వల్లెవాటు వేసుకున్నాడు. వెడల్పాటి బెల్టు నడుం చుట్టూ బిగించాడు. చేతిలో ధనస్సు... వెనక బాణాలతో నిండిన పొది....

ఈ ఆకారంతో వేదికమీదికి వచ్చి ముందు అందరికీ నమస్కరించాడు.

ఆ తరువాత మైకుకు దగ్గరగా వచ్చి విల్లు చేత బట్టి ఒక్కసారి ధనుష్టంకారం చేశాడు.

అసలే ధ్వని ఏర్పాట్లు అద్భుతంగా వున్న ఆ హాలులో వింటినారి శబ్దం అద్భుతంగా శ్రవణ పేయంగా సమ్మోహనకరంగా అలలు అలలుగా ధ్వనించింది.

ప్రేక్షకులందరూ ఆ ధ్వనితో స్తబ్ధులై కూర్చుండి పోయారు.

ఆ తర్వాత అర్జునుడు బాణం సంధించి ఎదురుగా ఎత్తుగా హాలు పైకప్పుకి గురిచూసి బాణం వదిలాడు. బాణం ఎక్కడికి వెళుతున్నదో అని అందరూ వింతగా చూశారు.

ఎక్కడో పైన మందమైన వెలుగులో వ్రేలాడుతున్న దారం తెగి ఒక పెద్ద పూల పొట్లం విచ్చుకున్నది. పైనుంచి పువ్వులు జలజలమని ముందు వరుసలో కూర్చున్న ముఖ్యులపైన కురిశాయి.

జనంలోనుంచి కరతాళధ్వనులు మారుమ్రోగాయి.

తరువాత అర్జునుడు విజృంభించాడు. దూర లక్ష్యభేదనం ప్రదర్శించాడు. శబ్దవేధి ప్రదర్శించాడు. వెనకనుంచి బాణప్రయోగం చేసి లక్ష్యాన్ని దెబ్బ తీశాడు. పడుకుని బాణంతో గురితప్పకుండా కొట్టాడు. కాళ్లతో ధనస్సునుంచి బాణాలను ప్రయోగించాడు.

అన్నిటికీ మించి చివరలో ఒక మనిషి రెండు కళ్లమీదా రెండు రూపాయిబిళ్లలుంచి దూరంనుంచి రెండు బాణాలను ఒకేసారి ప్రయోగించి సుతిమెత్తగా, కళ్లకు ఒత్తిడి కూడా తగల కుండా ఆ నాణేలను ఎగురగొట్టాడు.

ఒకేసారి అయిదారు బాణాలు ప్రయోగించి వేరు వేరు లక్ష్యాలను పడగొట్టాడు. వెనుక పొదినుంచి కన్నుమూసి తెరిచేంతలో ఒక్కొక్కటి చొప్పున బాణాలు తీసి సంధించి అయిదు సెకండ్లలో ఎనిమిది బాణాలు ప్రయోగించాడు.

ప్రేక్షకులు వింతగా చూశారు.

అబ్బురపాటుతో చూశారు.

ముగ్ధులై చూశారు.

ప్రదర్శన పూర్తికాగానే కరతాళధ్వనులు మొదలై కొన్ని నిముషాలపాటు ఆగకుండా మ్రోగాయి.

మంత్రిగారు మంత్రముగ్ధులై పోయారు. తనంతట తానే ఒక్క ఉదుటున వేదికమీదికి వెళ్లి వినయంగా నిలబడివున్న అర్జునుణ్ణి కౌగలించుకున్నారు. అత్యంత ఆదరంతో మైకు ముందుకు వచ్చి అర్జునుడి ప్రజ్ఞను ప్రస్తుతించారు.

అంగవైకల్యం వున్నప్పటికీ అనితరసాధ్యమైన విద్య సాధించిన ఈ వ్యక్తి మన రాష్ట్రానికే కాదు దేశానికే గర్వకారణం అన్నారు. ఇలాటి ఒక అద్భుత వ్యక్తి ఇంతకాలమూ ఇలా అజ్ఞాతంగా వుండిపోవడం దేశ దురదృష్టం అన్నారు. ఇతడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొంది వుండవలసిందని అన్నారు. ఇలా పొగిడి పొగిడి చివరకు అర్జునుణ్ణి తన దగ్గరికి రమ్మన్నాడు. అతనికి బంగారు భవిష్యత్తు వాగ్దానం చేశాడు.

నిర్వాహకులలో ముఖ్యుడు అర్జునుడి దగ్గరికి వచ్చి అతన్ని మనసారా అభినందించాడు. ముందు చెప్పినదానికంటే ఎక్కువ డబ్బు కవరులో ఉంచి మంత్రిగారి చేతులమీదుగా ఇప్పించాడు.

పొగడ్తలు... శభాష్‌లతో వాతావరణం అంతా నిండి పోయింది.

చివరకు అంతా సద్దుమణిగింది.

ఎటువారటు వెళ్లిపోయారు.

అర్జునుడు దుస్తులు మార్చుకుని తన తోలు సంచి సర్దుకుని భుజం మీద ఉంచుకున్నాడు. నిర్వాహకుల దగ్గర సెలవు తీసుకుని హాలుదాటి రోడ్డు మీదికి వచ్చాడు.

చాలా పొద్దుపోయినట్టున్నది. రోడ్డు అంతా దాదాపు నిర్మానుష్యంగా వుంది. ఉండి ఉండి ఏదో ఒక వాహనం మాత్రం దూసుకుపోతున్నది....లైట్ల వెలుతురు రోడ్డు మీద చారలు చారలుగా మంద మందంగా పరుచుకుని వుంది.

కూడు 'కాకిపాలు' ఇల్లు సొమ్ములెల్ల ఇతరుల పాలు 'భ్రష్టుపెళ్లాముున్న పరునిపాలు' ఏది తనవెంట రాదురా ఎరుగమూఢ!' ఇలా ఆలోచనలు సాగిపోతూవుంటే అర్జునుడు తనలో తనే నవ్వుకున్నాడు. అంతలో అతనికి దగ్గు వచ్చింది. లేచి వెళ్లి ఒక పక్కగా ఉమ్మేయ బోయాడు. కానీ ఈసారి విషయం వేరు.

గొంతులో నుంచి మండుతున్నదేదో బయటపడిన అనుభూతి.

మరునిముషంలో మనిషి డీలాపడిపోయాడు. విపరీతమైన నిస్సత్తువఆవహించింది. వచ్చి బల్లమీద కూర్చున్నాడు. తోలుసంచి మీద చేయివుంచి అదొక తృప్తితో కళ్లు మూసుకున్నాడు.

ఆ సంచి పొడవుగా వుంటుంది. దానిలో అతని ధనుర్బాణాలుంటాయి. దాని జోలికెవరూ వెళ్లరు... దాన్ని ఎవరూ ఆశించరు. కానీ దాని లో లోపలి పొరలలో ఒక చిత్రమైన అర వుంది. అందులో వుంది అతని సమస్తమూ..

అంతలో అతని ఆలోచనలు మళ్లీ దాశరథి దంపతుల మీదికి మళ్లాయి.

వాళ్లు తనను గురించి ఏమనుకుంటున్నారో అనుకున్నాడు.

ఏమీ అనుకోరు. అమ్మాయిని ప్రేమగా చూస్తారు. ఆమె కూడా వారితో వారి పిల్లలలో ఒకదానిలా కలిసిపోయి వుంటుంది అనుకున్నాడు మళ్లీ. అంతలో ఆవులించి చిటికెవేసి చేతివ్రేళ్లు విరుచుకున్నాడు.

*****

శంతన్ భోజనాల బల్లముందు కూర్చుని ఒకటే హడావిడి చేస్తున్నాడు.

'ఆకలి.... ఆకలి...,' అంటూ

పిల్లలేమో ఉదయమే ఇంత తిని చదువులకు వెళ్లిపోతారు. దాశరథి కూడా భోజనం చేసి ఆఫీసుకు వెళ్లిపోతాడు.

శాంతమ్మ పూజాపునస్కారాలు పూర్తిచేసుకుని అప్పుడు ఇవతలికి వస్తోంది.

'ఈ మూగమొద్దు ఎక్కడుందో' అన్నాడు శంతన్ పెద్దగానే.

శాంతమ్మ అటే వస్తూ ఆ మాట విన్నది.

ఆమెకు ఇటీవల అతని వరస ఏమీ బాగులేదు. ఇన్నేళ్లకు చుక్కతెగిపడ్డట్టు వచ్చాడు. ఏదో బీరకాయ పీచువంటి సంబంధం వుందే అనుకుందాం. అయినా ఇలా తిష్టవెయ్యడం ఏమిటి ? ఉన్నవాడు బుద్ధిగా వుండక ఈ అల్లరి ఏమిటి ? అనుకుంటున్నదామె.

రోజూ పగలంతా ఇంటిపట్టునే వుంటాడు. తిని పడుకుంటాడు. రేడియో లేక టేపురికార్డరు నిరంతరం మోగుతూవుండవలసిందే కర్ణకఠోరంగా. సాయంత్రం బయటికి పోయి ఎక్కడెక్కడ తిరుగుతాడో తెలియదు. బాగా పొద్దుపోయాకగానీ ఊడిపడడు. అతడు వెంట తెచ్చిన పెద్ద బలమైన సూట్‌కేసును ఇంత వరకు తాళం తీసిన జాడలేదు. పొద్దుపోయాక ఇంటికి వచ్చినప్పుడు అతనికి వడ్డించేందుకు సిద్ధమైతే భానుతో అవాచ్యమైన ప్రసంగం మొదలుపెడతాడు. అందువల్ల ఈ మధ్య శాంతమ్మ ఆ పిల్లను వారించి తానే లేచి అతని తిండి సంగతి చూస్తున్నది.

'ఆకలి... ఆకలి...' అని అరుస్తున్నాడతడు. శాంతమ్మ వెళ్లగానే 'ఈ పప్పుసుద్ద ఎక్కడుంది.' అని అడిగాడు.

'అలా మాట్లాడకు' అన్నది శాంతమ్మ మందలిస్తూ. 'ఇంకెలా మాట్లాడాలి ? ఎవరో దిక్కులేనివాడి కూతుర్ని ఇంట్లో పెట్టుకున్నారు. ఇది పనిమనిషికంటే ఎక్కువేమిటి ? పనిమనిషిగానే చూడాలి. ఊరికే మెక్కడానికా ఇక్కడుంది ? పోనీ మరోటి చెప్పు. దీన్ని నాలాటివాడు చేసుకునేందుకు సిద్దపడితే ఎలా వుంటుంది ?'

'ఊరుకో. మాట్లాడకు. ఆ పిల్ల వింటుంది.' అన్నది శాంతమ్మ అప్పటికీ సహనం చూపిస్తూ.

'ఏమీ వినదు. అసలు వినబడదు కూడా. మూగ వాళ్లకు చెవుడుకూడా వుంటుందిలే.'

అప్పటికీ భాను వంటగదిలోనుంచి ఇవతలికి రాలేదు. లోపల స్టోరు నుంచి తెచ్చిన పొట్లాలు విప్పి సర్దుతున్నది. అకస్మాత్తుగా ఒక దినపత్రిక తాలూకు కాగితం మీద ఆమె దృష్టిపడింది. దాన్ని తీసుకుని సాపుచేసి కాస్సేపు చూసి ఆ తర్వాత మడిచి జాకెట్టులో దాచుకుంది. అప్పుడు ఇవతలికి వచ్చింది.

శంతన్ 'అమ్మయ్య ! ఊడిపడిందిరా బాబూ' అన్నాడు.

ఆ తర్వాత శాంతమ్మ కింద కూర్చునీ శంతన్ బల్లముందు కూర్చునీ భోజనం చేశారు. అంతసేపూ శంతన్ మాట్లాడుతూనే వున్నాడు.

'అక్కా ! నువ్వెన్నన్నా చెప్పు... ఈ పిల్ల విషయంలో నా అనుమానాలు నాకున్నాయి. వాడెవడో దీన్ని లేవదీసుకొచ్చాడని నా అనుమానం. పరిస్థితులు అనుకూలించలేదో, లేకపోతే వాళ్లవాళ్లు పట్టుకుని కాళ్లూచేతులూ విరగ్గొట్టి చావగొడతారనే భయంతోనో ఇక్కడికి తెచ్చి మీ నెత్తిన పడేశాడు... తన దోవన తాను పోయాడు...'

శాంతమ్మ చివాలున తల ఎత్తి చూసి 'నీకింకా ఎన్నాళ్లు సెలవు వుంది ?' అని అడిగింది. 'దాన్దేముంది ? నాకు కావలసినన్నాళ్లు సెలవు వుంటుంది. నాది ఇష్టారాజ్యం.'

శాంతమ్మ మరి మాట్లాడలేదు. అతని వాలకం ఆమెకు అమిత చికాకు కలిగించింది. భాను ముఖం వంక చూస్తే అసలా అమ్మాయి ఈ మాటలు వినిపించుకున్న జాడ అయినా లేదు.

*****

అసలే పల్లెటూరి రోడ్డు...

అందునా కిందటి దినం కురిసిన వర్షానికి కాబోలు అంతా బురద బురదగా తయారై కసకసలాడుతున్నది. ఇక్కడి నుంచి కనీసం మైలు దూరం కచ్చారోడ్డు మీద నడిస్తేగానీ తాను ఊరికి చేరుకోలేడు. అప్పటికే అంతవరకు మలినమణివలె మందంగా వెలిగిన సూర్యుడు అస్తమించాడు. చీకట్లు నెమ్మది నెమ్మదిగా అలుముకుంటున్నాయి. బాటకి అటూ ఇటూ అన్నీ తుమ్మలు... ఆ వెనకనుంచి కీచురాళ్ల చప్పుడు... అతడు భుజం మీది బరువుతో అలాగే నడుస్తున్నాడు. అడుగు ముందుకు పడటం కష్టంగా వుంది.

అతనికి ఆయాసంగా వుంది. పైగా దాహంగానూ వుంది. శరీరంలో వున్న రక్తం

ఈ మధ్య చాలాసార్లు బయటికి వెళ్లిపోయింది. ఇక ఎన్నిరోజులు ? మొన్న పట్నంలో డాక్టరు, పరిచితుడే, పరీక్షించి ఏమీ మాట్లాడలేదు.

'చెప్పండి....డాక్టరుగారూ ! మీరేమీ దాచనక్కరలేదు. నా పని అయిపోతున్నదని నాకు తెలుసు. కానీ ఎంత కాలమని ? ఎన్ని నెలలని ? అది చెప్పండి చాలు' అన్నాడు అర్జునుడు.

డాక్టరు మాట్లాడలేదు.

'సరే ! మీరేమీ చెప్పకపోయినా ఫరవాలేదు. నాకు అర్థమవుతూనే వుంది. ఏవో సూచనలు కనిపిస్తూనే వున్నాయి. వెళ్లొస్తాను. బహుశా మళ్లీ రాలేనేమో ! మీరు నన్న భిమానించారు. ఆదరించారు. ఎందరినో పరిచయం చేసి ప్రోగ్రాములిప్పించారు. మీ ఋణం తీరేది కాదు. బహుశా మరు జన్మ అంటూ వుంటే త్వరలోనే మీ సేవకుణ్ణయి పుట్టి ఋణం తీర్చుకుంటాను.'

డాక్టరు మరోవైపు తిరిగి కళ్లు తుడుచుకున్న వైనం అర్జునుడు కని పెట్టలేదు.

ఇప్పుడీ బాట ఎంతకీ తరగటంలేదు.

చీకట్లు ముదిరాయి. చీకటి ఘనీభవించి చేత్తో తాకితే తగిలేట్టున్నది.

కాలిమీద పాకుతూ ఏదో జరజర వెళ్ళిపోయి నట్టనిపించింది. బహుశా పాము కాబోలు ! కాబోలు ఏమిటి ? పామే అయివుంటుంది.

చాలాసేపు నడవగా నడవగా దూరంగా మందమైన వెలుతురు. గ్రామం దగ్గరయినట్టే...

ఊరికి ఒకవైపు వున్న ఈ పెద్ద కుంకుడు చెట్టు తనకు బాగా పరిచయం.

భయంకరమైన పెద్ద రాక్షసి ఏదో జుట్టు విరబోసుకుని కదలకుండా నిలబడ్డట్టు.. ఆ కొమ్మలలో ఎన్ని పక్షులో... ఆ చెట్టు మీద దయ్యాలున్నాయనీ, పిశాచాలు కూడా వున్నాయనీ ఒకప్పుడు అనుకునే వారు తాము. ఇంతకాలంలోనూ ఎన్నడూ పొద్దు గూకిన తర్వాత తామెవ్వరూ ఆ చెట్టు దరిదాపులకే రాలేదు.

ఇప్పుడు దాని పక్కనుంచి నడుస్తున్నాడు. ఏవో పక్షులు రొద చేస్తున్నాయి. చెట్టు దాటాక వెదురు పొదలు... దట్టంగా వాటిలో విసురుగాలి చొరబడి వింత ధ్వని వెలువడుతున్నది.

* * * * *

అది దాదాపు పాడుబడిన ఇంటివలె ఉంది. బయటి ప్రహరీ గుమ్మం గోడ రాళ్ల మధ్య మట్టి రాలి బలహీన పడి చేయి వేస్తే ఒరిగిపోతున్నది.

అర్జునుడు అతిజాగ్రత్తగా ఆ చీకటిలో తడువుకుంటూ తాళం తీశాడు. తుప్పుపట్టిందో ఏమో ఆ తాళం చాలా బాధపెట్టికానీ లొంగలేదు. తలుపుతీసి లోపల అడుగుపెట్టాడు. ఆ చిన్న ఆవరణ అంతా ఆకులలములూ, చెత్తాచెదారంతో నిండి ఉంది.

అతడు అగ్గిపుల్ల గీచి ఆరి పోకుండా చేతుల మధ్య కాపాడుకుంటూ అడుగులు వేశాడు. చిన్న వసారా అంతా ఉప్పురిసిపోయి దుమ్ము ధూళితో నిండి ఉంది. మరో తాళంచెవితో మళ్లీ కష్టపడి ఇంటి తలుపుతీశాడు. లోపల అంతా చీకటి. అడుగు

ఎటుపేయాలో తెలియని స్థితిలో అతడలా కొన్ని నిముషాలు నిలుచుండిపోయాడు.

అంతలో అలికిడి విని కాబోలు పక్క ఇంటి యజమాని, అరవై ఏళ్లవాడు, చేతిలో లాంతరు పుచ్చుకుని 'ఎవరది ? అర్జునుడేనా ?' అంటూ వచ్చాడు.

అర్జునుడు నవ్వుతూ-'నేనే బాబాయ్ ! బాగున్నారా ?' అన్నాడు.

'నువ్వేనా ? నువ్వే అనుకున్నాంలే. ఇంకెవరొస్తారు ? మీ పిన్ని అలికిడి విని నువ్వే వచ్చి వుంటావు చూసి రమ్మంటే వచ్చాను. ఎన్నాళ్లాయెరా నిన్ను చూసి. రా. రా. మా ఇంటికి పోదాం రా'

అర్జునుడు తన బరువును ముందు గదిలో దించుకుని ఆయన వెంట వెళ్లాడు.

ఆ ఇల్లాలు అతన్ని చూసి సంబరంగా నవ్వుతూ - 'ఇప్పటికి ... ఇన్నాళ్లకు... ఇల్లు గుర్తొచ్చిందిరా ?' అని పలకరించింది.

'నీ తిరుగుడు ఎప్పుడు పూర్తవుతుందిరా ?' అని కూడా అడిగింది.

అర్జునుడు అదోక రకంగా నవ్వుతూ - 'పూర్తయిందిలే. ఇక తిరగను. ఇల్లు, ఊరు కదిలి వెళ్లను. వెళితే ఏకంగా....' అంటూ చేతులు పైకి చూపించాడు.

'అవాచ్యాలు పలక్కు' అన్నదామె మందలిస్తూ. 'పెరట్లో నీళ్లున్నాయి. స్నానం చేసిరా. ఎప్పుడు తిన్నావో ఏమో ! మీ బాబాయితోపాటు ఎంగిలిపడుదువుగాని' అన్నది.

ఆయన లాంతరు అందుకున్నాడు. పెరటిలోకి నడుస్తూ - 'ఒక్కడివే వచ్చావు. అమ్మాయి....?' అన్నాడు.

అర్జునుడు 'దాని విషయమై ఇంక నాకు నిశ్చింత బాబాయ్ ! మంచి పుణ్యస్థలంలాటి చోట. నేనంటే ప్రాణం ఇచ్చేచోట... విడిచాను' అన్నాడు.

*****

భాను ఒంటరిగా పక్కగదిలో చాపమీద కూర్చుని ఉంది.

శాంతమ్మ లోపల వంటగదిలో తన పనిమీద తానున్నది.

అన్నా చెల్లెళ్లింకా రాలేదు. ఇంటి యజమాని సరేసరి, ఆరు గంటలకు గానీ రాడు.

శంతన్ అప్పటివరకు పవళింపు సేవ చేసి అప్పుడే తయారై ఎటో వెళ్లాడు.

భాను ఆ దినపత్రిక ముక్క తీసింది. మడతలు విప్పింది. లోపల ఒక వార్త. మధ్యలో ఒక ఫోటో... ముగ్గురు వ్యక్తులు.

భాను మళ్లీ ఆ కాగితాన్ని మడిచి తన సంచిలోనే లోపలగా ఉంచింది. ఏదో ఆలోచనలో పడినదానిలా కూర్చుండిపోయింది.

ఆనాడు శంతన్ అందరి భోజనాలూ అయ్యాక దిగబడ్డాడు. మస్తుగా మందు సేవించి వచ్చాడేమో హుషారుగా ఉన్నాడు.

అన్నాచెల్లెళ్ళు భోజనాలు ముగించి సోఫాలో కూర్చుని వున్నారు. దాశరథి పేపరు చూస్తూ పడక కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

శంతన్ గలగల మాట్లాడుతూనే బట్టలు మార్చుకుని వచ్చి భోజనాల బల్లముందు

కూర్చున్నాడు.

శాంతమ్మ అతన్ని చూసి 'వడ్డించనా ?' అని అడిగింది.

అతడు స్వరంలో అనవసరమైన తీవ్రత ప్రదర్శిస్తూ- 'నువ్వెందుకు ? నువ్వెందుకు వడ్డించాలి ? దాన్ని ఇటుపిలు. ముప్పొద్దులా ఎద్దులా తింటున్నది కదా ? పిలిచి వడ్డించమను' అన్నాడు.

శాంతమ్మ తీవ్రస్వరంతో 'అసహ్యంగా మాట్లాడకు' అన్నది.

దాశరథి కూడా విపరీతమైన చిరాకుతో తల ఎత్తి చూశాడు. కానీ ఈ విషయంలో తాను కలుగజేసుకోకూడదు. ఆ బాధ్యత అక్కగారిది అనుకున్నాడు.

అన్నా చెల్లెళ్లిద్దరూ కూడా తీక్షదృక్కులతో చూస్తున్నారు.

శంతన్ బల్లమీద పిడికిలితో ఒక్క గుద్దు గుద్ది 'ఏం ? నేనేం తప్పు మాట్లాడాను ?' అని అరిచాడు.

ఆ తర్వాత లేచి తూలుతూ సిగిరెట్టు ముట్టించుకుని గొంతు మార్చి 'పోనీ. ఒక పనిచేయ్. దాన్ని నాతో పంపించు. నేను తీసుకుపోతాను. నాకూ పని మనిషి కావాలి. వంటమనిషి కావాలి. అన్నీ సమకూరి నట్టవుతుంది.' అన్నాడు.

శాంతమ్మ అప్పుడురెచ్చి పోయింది. తోక తొక్కిన తాచులా లేచింది.

'దుర్మార్గుడా! ఏదో ఒక రకంగా తమ్ముడివని ఇన్నాళ్లూ సహించాను. ఇప్పుడికనీ నీచపు మాటలు సహించే ఓపిక నాలో లేదు. తెల్లవారి నీ మొహం నాకు చూపించకు. నీ దోవన నువ్వు వెళ్లిపో. ఇదుగో, ఇదే చెబుతున్నాను. తెల్లవారాక నువ్వు ఇక్కడే ఉన్నావంటే నీ సంచి, సూట్‌కేసు వీధిలో పారేయిస్తాను. మొహాన ఇన్ని పేడనీళ్లు కొట్టి మెడపట్టి వీధిలోకి తోయించేస్తాను జాగ్రత్త.'

శంతన్ ఆమె విజృంభణతో నిరుత్తరుడైనవాడిలాగ కూర్చుండిపోయాడు.

తర్వాత వక్రంగా నవ్వుతూ – 'అంత పని నువ్వు చెయ్యలేవులే. చూస్తూ చూస్తూ తమ్ముణ్ణి' అంటున్నాడు.

వీధిలో ఏదో వాహనం ఆగిన సవ్వడి.

సరిగ్గా అదే సమయంలో పక్క గది గుమ్మంలో నుంచి ఉచ్చ స్వరంతో మాటలు వినబడ్డాయి.

భాను గుమ్మంలో నిలబడి ఉంది.

ఆడపులిలా నిలబడి ఉంది. భయంకరమైన తాచు పాములాగా నిలబడి ఉంది.

ఆమె...

ఆమె మాట్లాడుతున్నది.

ఇన్నాళ్లకు నోరు విప్పి బుసలు కొడుతూ మాట్లాడుతున్నది.

దాశరథి, శాంతమ్మ, పిల్లలు అప్రతిభులై అటు చూశారు.

భాను చెయ్యి చాపి శంతన్‌వైపు చూపిస్తూ – 'దిస్‌మాన్ ఈజె బీస్ట్ – ఎ చీట్...

దిస్ మాన్ ఈజ్ క్రుయల్... ఎన్ ఎనిమీ ఆఫ్ ది పీపుల్' అంటున్నది.

కంఠస్వరం కంచుమోగినట్టు మోగుతున్నది.

కళ్లు ఎర్రగా రక్తతామరలవలె ఉన్నాయి. అంగార కణాలు కురుస్తున్నాయి.

'ఈ మనిషి దొంగ...పాపాత్ముడు... సంఘద్రోహి... ఇతని పాపం పండింది.' అన్నది మళ్లీ భయంకరంగా.

ఆ వెంటనే చివాలున వెనుదిరిగి లోపలికి వెళ్లిపోయింది.

పంచలో బూట్లసవ్వడి వినిపించింది. తర్వాత తలుపుమీద ధ్వని.

దాశరథి ఆందోళనపడుతూ వెళ్లితలుపు తీశాడు. పోలీసులు సుడిగాలిలా లోపలికి దూసుకువచ్చారు.

ఈ లోపుగానే శంతన్ వెనుక గదుల్లోకి, తర్వాత పెరటి గుమ్మం వైపుకు, ఆ తర్వాత వెనుక వీధిలోకి పారిపోయే ప్రయత్నం చేశాడు. కానీ పోలీసులు వెంబడించి వెళ్లి అతని ప్రయత్నం ఫలించకుండానే పట్టుకుని ముందు గదిలోకి తీసుకువచ్చారు. చేతులకు బేడీలు తగిలించారు. పక్కగదిలోని సూట్‌కేసును కూడా తెచ్చారు. దాన్ని బలవంతంగా తెరిచారు. దాన్నిండా కట్టలు కట్టలుగా పెద్ద నోట్లు పేర్చి ఉన్నాయి.

అంతా దిగ్భ్రమచెంది చూస్తూ ఉండగా పోలీసు అధికారి దాశరథితో - 'మీరొకసారి రేపు పోలీసు స్టేషనుకు రావలసి ఉంటుంది.' అన్నాడు.

దాశరథి ఆందోళనతో ఏదో అడబోతూ ఉండగా 'మీరేమీ భయపడనక్కరలేదు. కంగారుపడనక్కరలేదు కూడా. ఊరికే స్టేట్‌మెంట్ ఇస్తే చాలు' అన్నాడు.

'అసలు సంగతి ఏమిటి ?' అని అడిగాడు దాశరథి.

'అదంతా పెద్ద కథ. రేపు మీకే తెలుస్తుందిలెండి.'

మరునిముషంలో అతన్ని జీపులో ఎక్కించుకుని వెళ్లిపోయారు.

అంతా నిశ్శబ్దం. ఎవ్వరూ కొద్దిక్షణాలు మాట్లాడలేదు. దిగ్భ్రాంతినుంచి తేరుకోనూలేదు.

అప్పుడు భాను మాట్లాడటం ప్రారంభించింది.

'ఈ మనిషి...వట్టి మోసగాడు. మామూలు మోసం కాదు. భయంకరమైన మోసం. వీడికిద్దరు ఫ్రెండ్సున్నారు. ముగ్గురూ కలిసి ఒక కొత్త ఊళ్లో దిగి ఒక బోర్డు పెడతారు. ఒక ఆఫీసు తెరుస్తారు. కరపత్రాలు పంచుతారు. ఇవ్వాళ కొంత డబ్బు చెల్లిస్తే నెల రోజులలో రెండు రెట్లు ఇస్తామంటారు. లేకపోతే ఆ సొమ్ముకు సమానమైన వస్తువులిస్తామంటారు. ప్రచారం చేస్తారు. ఒకరిద్దరు నిరుద్యోగులను గుమాస్తాలుగా పెట్టుకుంటారు. ఇదీ పద్ధతి. ముందు కొందరికి అలాగే ఇచ్చి నమ్మిస్తారు. ఇలా కొన్నాళ్లు గడిపి బాగా లక్షల్లో డబ్బు పోగయ్యేసరికి ఉన్నట్టుండి ఏదో ఒక అర్ధరాత్రివేళ బిచాణా ఎత్తివేస్తారు. ఎటెటో పోతారు.'

'ఇదంతా నీకెలా తెలుసు ?' అని అడిగాడు దాశరథి ఆశ్చర్యంతో.

'ఇదుగో' అంటూ ఆ దినపత్రిక ముక్క తీసి ఇచ్చింది భాను.

'ఇందులో కథ అంతా వివరంగా ఫోటోతో సహా ఉంది.'

దాశరథి దాన్ని అందుకుని చదువుతూ కూర్చుండి పోయాడు.

శాంతమ్మ, పిల్లలు భాను చుట్టూ చేరారు.

'అది సరే. నువ్విన్నాళ్లూ మూగదానిలా నోరెత్తకుండా..'

భాను కన్నీళ్లతో శాంతమ్మకు నమస్కరించింది. 'నన్ను మన్నించండమ్మా! మా నాన్న మీ దగ్గర నన్ను విడిచి వెడుతూ నన్ను అన్నీ భరించమన్నాడు. సహించమన్నాడు. నోరెత్తకుండా ఉండమన్నాడు. అంతే. నేను నోరెత్తదలుచుకోలేదు. నన్ను క్షమించండి. మీరే నాకు తల్లీ తండ్రీ అని చెప్పాడు కూడా'

'నీకు చదువు రాదుగా ? ఈ పేపరెలా చదివావు ?' వసంత ప్రశ్న.

'నేను వట్టి భానును కాదు వసంతమ్మా ! భాను బి. ఎ. ఇంగ్లీషు లిటరేచర్. యూనివర్శిటీ గోల్డు మెడలిస్టును తెలుసుకో..'

ప్రభాకరం, వసంత ఆశ్చర్యంతో చూశారు.

దాశరథి విచిత్రంగా చూశాడు.

భాను అంతలో కంట తడి పెట్టింది.

'ఎందుకమ్మా ? ఏమయింది ?' అన్నది శాంతమ్మ.

'మా నాన్న... ఎక్కడున్నాడో ? ఎలా ఉన్నాడో? ఎప్పుడొస్తాడో' అన్నది లోగొంతుకతో భాను.

'వస్తాడొస్తాడు' దిగులుపడకు అన్నాడు దాశరథి.

దాశరథి ఆ మాట అని భానును సముదాయించడానికి ప్రయత్నించాడేకానీ అతనికీ లోలోపల ఆందోళనగానే ఉంది.

****

ఈ అర్జునుడు ఎక్కడికి వెళ్లినట్టు ? ఏం చేస్తున్నట్టు?

అతడు ఆఫీసులో కుదురుగా కూర్చోలేకపోయాడు. పనిమీదికి బుద్ధి పోవడంలేదు. ఇవ్వేళ ప్రత్యేకించి ఏదో తెలియని ఆందోళన. మనసంతా ఒక విధమైన గ్లాని ఆవరించినట్టున్నది.

కాస్సేపు ఫైళ్లు కట్టి పెట్టి పడక కుర్చీలో కూర్చుని కళ్లు మూసుకుని ఉండిపోయాడు.

ఎంతసేపయిందో తెలియదు. ఫ్యూను వచ్చి 'అయ్యగారూ' అని పిలుస్తుండగా ఈ లోకంలోకి వచ్చాడు.

'అయ్యగారూ ! టెలిగ్రాం...'

ఆందోళనపడుతూ అందుకుని చూశాడు.

'అర్జునుడు ఈజ్ సీరియస్... వాంట్స్ టు సీయూ.. స్టార్ట్ ఇమ్మిడియెట్లీ'

తమ ఊరికి దూరంగా ఉన్న చిన్న పట్నంలోని టెలిగ్రాఫ్ ఆఫీసునుంచి.

ఎప్పటి టెలిగ్రాం అది ? ఇది మూడో రోజు. దాశరథి హడావిడిగా లేచాడు.

ప్యూన్‌ను పిలిచి 'శంకరయ్యా ! నేను అర్జంటుగా ఊరికి వెళ్తున్నాను. ఇంటికి వెళ్లి అయ్యగారు టూర్‌కు వెళ్లారు. రేపు ఎల్లుండిలో వస్తారని చెప్పు. ఆఫీసు పని మీద అర్జంటుగా వెళ్లవలసి వచ్చిందని చెప్పు. టెలిగ్రాం సంగతి అస్సలు ఎత్తకు. నేను చెప్పినదానికి మించి ఏమీ వాగకు. అర్థమైందా ?' అన్నాడు. ఆఫీసులో డబ్బు అడిగి తెప్పించుకుని ఉన్నవాడున్నట్టు ప్రయాణమైనాడు.

రైల్లో ఒకటే ధ్యాస. ఈ అర్జునుడు పల్లెకెప్పుడు చేరుకున్నాడు ? ఇన్నాళ్లూ ఏమి చేశాడు ? ఎక్కడెక్కడ తిరిగాడు ? అనారోగ్యం ఏమిటి ? అర్జునుణ్ణి గురించి శంకలూ ప్రశ్నలూ తప్ప సమాధానాలు ఉండవు.

దాశరథి కిటికీ పక్కగా కూర్చుని కళ్లు మూసుకున్నాడు.

బయటనుంచి చల్లని గాలి విసురుగా వీస్తున్నది. సూర్యుడు అస్తమించబోతున్నాడు. ఇకరాత్రి అంతా ప్రయాణం. ఆ తర్వాత ఆ చిన్న స్టేషనులో రైలు దిగి మైలు దూరం దాదాపు నడవాలి.

రైల్లో గిజాటుగా ఉంది. కేవలం కూర్చోడానికి మాత్రమే చోటు దొరికింది.

కంపార్ట్‌మెంట్ ముఖద్వారాల దగ్గర ప్రయాణీకులు కిక్కిరిసి ఉన్నారు. బయటినుంచి వస్తున్న గాలివల్ల కూడా ఏమీ సుఖం కనబడటంలేదు. లోపల ఫ్యాన్లు తిరుగుతున్నాయే గాని వాటివల్లనూ ఏమీ లాభం లేకుండా ఉంది.

దాశరథి కళ్లు మూసుకున్నాడు.

ఈ అర్జునుడు విచిత్రమైన ప్రాణి. తాము కలిసి గడిపిన బాల్యం తప్ప తరువాత అతని సమాచారం చాలా కొద్దిగా మాత్రమే తనకు తెలుసు. అప్పుడప్పుడు తమ పొలం పనిమీద వచ్చినా తనను గురించి ఏమీ చెప్పేవాడు కాదు.

జీవితం ఎలా గడుస్తున్నదీ, తాను ఏం చేస్తున్నదీ ఏమీ తెలిపేవాడు కాదు. ఏమీ తెలియడం కూడా ఇష్టంలేనివాడిలా తన విషయాల ప్రసక్తివచ్చినప్పుడు మూగగా ఉండి విషయాంతరానికి వెళ్లేవాడు.

దానికి తోడు దాశరథి సంగతి కూడా అంతే అయింది. జీవితమనే సుడిగుండంలో పడి, ఉద్యోగమూ బదిలీలూ ప్రమోషన్లూ వీటితోనే, ఆ ధ్యాసతోనే గడిచింది.

ఎక్కడో మునిగి ఎక్కడో తేలినట్టు ఉండేది. ఆ ఊరితో ఉన్న ఇల్లు పొలంవంటి బంధం కూడా తెగిపోయాక మరీ అన్యాయమైపోయింది.

రాకపోకల హడావిడి తగ్గింది. అప్పుడప్పుడు ఉత్తరాలు మాత్రం నడిచాయి. అదీ కొద్దిసార్లే. ఇటీవల అదీలేదు.

ఇప్పుడు..

ఇన్నేళ్ల తర్వాత...

ఇలా మెరుపువలె వచ్చి తన మీద ఒక బాధ్యత ఉంచి వెళ్లిపోయాడు. వెళ్లేటప్పుడు

చెప్పి కూడా వెళ్లలేదు.

తానూ తన భార్యా కూడా ఆ బాధ్యతను ఆనందంగానే ఆమోదించారు. అది వేరే సంగతి.

ఇంతలో హఠాత్తుగా ఈ వర్తమానం...

దాశరథి మనసంతా అలజడి...

అర్జునుడికేమయింది ?

ఏమి కాబోతున్నది?

ఈ రైలు ఇంత నెమ్మదిగా నడుస్తున్నదేమి ? ప్యాసింజరు రైలు ఎక్కడం బుద్ధితక్కువ. అయినా చేసేది లేదు. ఆ చిన్న స్టేషనులో ఫాస్టు రైళ్లు ఆగవు కదా ! అనుకున్నాడు. కిటికీలోనుంచి అంధకారంలోకి చూస్తూ ఉండిపోయాడు.

మామూలు కంటికీ, మామూలు మనసుకూ అయితే అది అందమైన ఉదయవేళ..

కానీ ఆ చిన్న స్టేషనులో రైలు దిగిన దాశరథికి అంతహాయి అనిపించలేదు. రైలు ఒక్క నిముషం కూడా ఆగకుండా కదిలి వెళ్లిపోయింది.

దాశరథి చేతి వేళ్లు విరుచుకుంటూ కొన్ని క్షణాలు నిలబడ్డాడు. ఎదురుగా ఉదయిస్తున్న సూర్యబింబం. ఆ మొదటి కిరణాలు పృథ్విని సోకి చెట్లు చేమలను కొండలు గుట్టలను సుతిమెత్తగా స్పృశిస్తున్నాయి. ఆ వైపున కొండ... ఎర్రని మట్టికొండ.

అతడు స్టేషనులో నుంచి బయటికివచ్చి అటూ ఇటూ చూశాడు.

ఎదురుగా తానెరుగని కొత్త ఆకర్షణ. పూరిపాకలో చిన్న టీ దుకాణం.

ముందు రెండు మూడు పలుచని బల్లలు.

దాశరథి అక్కడికి వెళ్లి 'టీ ఇవ్వు' అంటూ బల్ల మీద కూర్చున్నాడు.

రుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడు.

టీ తాగి డబ్బు లిచ్చి తనకు తెలిసిన మట్టి బాటపట్టి నడవడం ప్రారంభించాడు. అటూ ఇటూ తుమ్మలు పెరిగి ఉన్నాయి. అక్కడొకటి అక్కడొకటి గంగరావి చెట్లు ఉన్నాయి. బాట అంతా రాత్రి కురిసిన పలుచని మంచువల్ల కొద్దిగా తడిగా ఉంది. బాటకవతల అటూ ఇటూ కనుచూపుమేర అంతటా పొలాలు. ఇప్పుడక్కడ ఏ పంటాలేదు. ఉండి ఉండీ అప్పుడొక పక్షి, అప్పుడొక కాకి ఎగురుతూ పోతున్నాయి.

ఊరు మొదట్లోకి రాగానే అకారణంగా దాశరథి గుండెలు జలదరించాయి.

తానేమి చూడబోతున్నాడు అనిపించింది. అంతలోనే మనసు కుదుటపరచుకుని ముందుకు నడిచాడు.

ఈ వరస ఇళ్లు దాటాలి. ఈ సందు తిరగాలి. ఊరేమీ పెద్దగా మారలేదు. ఈ ఊళ్లు ఇంతలో మారవు కూడా. కొన్ని పూరిళ్లు పెంకుటిళ్లయినాయి.

ఈ చెట్టు ఇప్పటికీ ఇంకా అలాగే వృద్ధమూ నిలాగా నిలబడి ఉంది. దాని జోలికెవరూ పోలేదేమో ! ఇది ఒకప్పటికి తమ ఇల్లు. ఇప్పుడెవరుంటున్నారో! కొంచెం ముందుకు

నడిచి సందు తిరిగితే అర్జునుడి ఇల్లు.

అదుగో బయట ఏమీ హడావిడిలేదు. ఎవరూ కనుపించనూలేదు. కాబట్టి ఏమీ జరగలేదు. అర్జునుడికి అనారోగ్యం చేసి నెమ్మదించి ఉంటుంది.

ఆ గుమ్మం ముందు ఆగి దాశరథి 'అర్జునా ! అర్జునా !' అని పిలిచాడు. అతని గొంతు అతనికే విచిత్రంగా వినిపించింది.

పక్క గుమ్మంలోనుంచి ఒక ముదుసలి, అరవై ఏళ్లవాడు, ఇవతలికి వచ్చాడు.

'ఎవరూ ?' అంటూ రెండడుగులు వేసి - 'దాశరథి గారేనా ?' అన్నాడు.

మళ్లీ అంతలోనే 'రండి రండి' అన్నాడు.

'ఇటు రండి. రాత్రి అంతా ప్రయాణం కదా ! బాగా అలిసిపోయి ఉంటారు. ఇటు రండి. కూర్చోండి.'

తమ వరండాలోకి దాశరథిని పిలిచి ఒక కుర్చీ ముందుకు జరిపాడు.

దాశరథి వింతగా చూస్తూ నడిచి వెళ్లి కూర్చుని ఒణికే చేతివేళ్లను విరుచుకుంటూ ఆవులించి అన్నాడు.

'అవును. రాత్రి అంతా ప్రయాణమే. రైల్లో రద్దీ. కూర్చునేందుకు మాత్రం వీలుదొరికింది. ఇప్పుడే వస్తున్నాను.'

'మొహం కడుక్కుందురుగాని' అంటూ ఆయన లోపలికి వెళ్లాడు.

లోపల ఆయన భార్య కాబోలు వివరం కనుక్కుంటున్నది.

ఆయన ఒక్క నిముషంలో బొక్కెనతో నీళ్లు, చెంబు తెచ్చి ఒక వేపపుల్ల కూడా అందించాడు. తర్వాత మళ్లీ లోపలికి వెళ్లాడు.

దాశరథి ఎత్తయిన ఆ పంచంలో చివరగా కూర్చుని ముఖప్రక్షాళనం పూర్తిచేసి రుమాలుతో ముఖం తుడుచుకుని కూర్చున్నాడు.

లోలోపల ఏదో తెలియని వేదన... ఏమీ తోచని వాడిలా అటూ ఇటూ చూస్తూకూర్చుండిపోయాడు.

ఆవరణలో గోడ పక్క ఒకే ఒక మందారచెట్టు... అరచేతి వెడల్పున పూచినకొన్ని వెడల్పాటి పువ్వులు. ఎదురుగా మట్టి గోడమీద కూర్చుని సవ్వడి చేస్తున్న గోరువంక.

ఆయన అంతలో కాఫీ గ్లాసుతో వచ్చాడు. దాశరథి దాన్ని అందుకుంటూ ఏదో అడగబోయి మళ్లీ ఆగిపోయాడు ఇష్టంలేనివాడిలాగు.

ఆయన గుమ్మంలో కూర్చుని 'నేనే ఇప్పించాను టెలిగ్రాం మీకు. దానికీ, మీకు తెలుసుగా, చాలా దూరం వెళ్లాలి. నాలుగు మైళ్లు. మీకెప్పుడు అందింది. ?' అన్నాడు.

'నిన్న మధ్యాహ్నం... మూడు గంటల వేళ'AÑO 'అబ్బో చాలా లేటయిందన్నమాట'

దాశరథి కాఫీ తాగడం ముగించి చిత్రంగా - 'వీడు.. అర్జునుడు... ఎక్కడికి వెళ్లాడు? ఇన్నాళ్లూ ఎక్కడున్నాడట ? ఏమిటి జబ్బు అసలు' అని అడిగాడు. అతని గొంతు

చిత్రంగా మారింది.

అయన అదోక రకంగా నవ్వి – అసలు టెలిగ్రాం ఇవ్వవద్దన్నాడు. మొదట అడ్రసు ఇవ్వనని మొండి కేశాడు. నేను బలవంతం మీద ఒప్పించాను. ఇప్పుడో కాస్సేపో అనిపించనప్పుడే మీకు టెలిగ్రాం ఇప్పించాను. నేను పంపించిన మనిషి సైకిలుమీద నాలుగు మైళ్లు వెళ్లి టెలిగ్రాం ఇచ్చి వచ్చేసరికే దాదాపు అంతా అయిపోయింది. నలుగురూ చేరారు. అలాదాటిపోయాడు' అన్నాడు.

దాశరథి గుండె గొంతుకలో కొట్లాడినట్టయింది. ఆవేదనతో తల్లడిల్లిపోయాడు.

'పోయాడా?' అని మాత్రం నెమ్మదిగా అన్నాడు. అంతలో అతని కళ్లు చెమర్చాయి. గుండెలు బరువెక్కినట్టనిపించింది.

ఇలాంటిదేదో ఖచ్చితంగా వినవలసి వస్తుందని తెలిసినా 'అబ్బే! అదేమీకాదు. అంతా సజావుగానే ఉంటుందని' తనను తాను మభ్యపెట్టుకుంటూ సమాధానపరుచుకుంటూ వచ్చాడింతసేపూ.

ఇప్పుడిక మనిషి క్రుంగిపోయాడు.

ఆయన మళ్లీ నెమ్మదిగా 'చాలాకాలంనుంచీ ఉంది జబ్బు. అప్పుడప్పుడు నాతో వెళ్లబోసుకుంటూ ఉండేవాడు. నోటివెంట రక్తం పడటం కొన్ని నెలల క్రిందటే మొదలయింది. ఒక డాక్టరున్నాడనీ, ఆయనకు తానంటే అభిమానమనీ, వైద్యం చేయించుకుంటున్నాననీ, అనేవాడు. ఎప్పుడొచ్చినా ఒకరోజు – ఉంటే గొప్ప... ఒకటే ఊళ్లు తిరగడం... ఆరోగ్యం సంగతి అసలు పట్టించుకునేవాడు కాదు. ఏం చేస్తాం? అంతా అయిపోయింది' అంటున్నాడు.

దాశరథి కదలకుండా కూర్చుని వింటున్నాడు.

'ఊళ్లో అందరికి అతనంటే ఇష్టం. గౌరవం. మొన్న ఊరంతా కదిలివచ్చింది. అతని కోరిక ప్రకారం అతని పొలంలోనే.. అంతా కానిచ్చేశాం. ఇంతా చేసి తనకంటూ ఏమీ లేకుండా చేసుకుని పోయాడు.'

'మరి... ఆ అమ్మాయి సంగతేమిటి? తనకూతురుని చెప్పాడు...అసలు....'

ఆయన మళ్లీ అదోక రకంగా నవ్వాడు.

'మీకంతా చెబుతాను. ప్రశాంతంగా ఉండండి. అతనెప్పుడూ మిమ్మల్ని గురించే చెబుతూ ఉండేవాడు. ఇటీవల మరీ ఎక్కువగా...అదే..అమ్మాయిని మీ దగ్గర దింపి వచ్చాక మరీ ఎక్కువగా చెప్పేవాడు. తానెన్నాళ్లో బతకననీ ఈ ప్రపంచంలో తనకున్నది మీరేననీ, తాను నమ్మేది కూడా మిమ్మల్ని మాత్రమే అనీ చెప్పేవాడు. తన బరువు బాధ్యతలు మీ మీద ఉంచి నిశ్చింతగా ఉన్నాననీ అనేవాడు..'

'నేనడిగేది అదే.. ఆ అమ్మాయి సంగతి..'

'అదే చెప్పబోతున్నాను. అతను పెళ్లే చేసుకో లేదు. కొందరు బుద్ధిమంతుడు. పిల్లనిస్తే సుఖపడుతుందని తమ పిల్లలనివ్వ జూపినా కాదన్నాడు. ఇది మొదట్లో.. తర్వాత ఈ పసిపిల్ల అతని మెడకు చుట్టుకుంది!'

దాశరథి ఉత్కంఠతతో వింటున్నాడు.

'ఈ పిల్ల అనాథ... తండ్రి యుద్ధంలో పోయాడు. ఈ ఊరివాడే. ఎక్కడో పంజాబులో పోయాడు. అప్పటికి అతని భార్య నిండు చూలాలు. ఆ వార్త వచ్చినప్పుడు ఆమె ముసలి తల్లిమాత్రం ఉంది. ఒక రోజల్లా అర్జునుడూ మేమూ ఆ విషయం ఆమెకు తెలియనివ్వలేదు. కానీ ముసిల్ది దుఃఖం పట్టలేక కక్కేసింది. ఆ తర్వాత గంటలో అరగంటకో పసికందు భూమ్మీద పడింది. అంతే.. తన పని అయిపోయినట్టు ఆ పసికందుకు జన్మనిచ్చి ఆ ఇల్లాలు తల వాల్చేసింది. అతను అర్జునుడికి ప్రాణ స్నేహితుడు. అర్జునుడు ఆ సపికందును నెత్తుటి గుడ్డును అప్పుడెత్తుకున్నాడు. ఆ ఎత్తుకోడం మళ్ళీ కిందికి దింపలేదు. ఒంటరివాడైనా, ఆడతోడు లేనివాడైనా ఆ పిల్లను అమిత గారాబంగా, అపురూపంగా పెంచాడు. ఆ పిల్ల తోడిదే లోకంగా బతికాడు. రాబడి అంతంత మాత్రమే అయినా ఆ పిల్లకు కాస్తవయసు రాగానే పట్నంలో స్కూల్లో చేర్చి హాస్టళ్లలో వుంచి చదివించాడు. స్కూలు చదువుకాగానే కాలేజీలోనూ చేర్పించాడు. ఏవో స్కాలర్‌షిప్పులువంటివి వచ్చాయి. ఇక తాను విలువిద్యా ప్రదర్శనలు ఆ అమ్మాయికోసం పది రూపాయలైనా వందరూపాయలైనా ఎంతైనా కాదనేవాడు కాదు. అప్పుడప్పుడు నాతో దాని కోసమే బతుకుతున్నాను బాబాయ్ అనేవాడు.'

గొంతు పూడుకుపోయినట్టు కాగా ఆయన కాస్సేపు ఆగాడు.

తర్వాత మళ్ళీ గొంతు సవరించుకుని - 'అంతలో మాయదారి రోగం వచ్చిపడింది. ఇక అప్పుడు మీ దగ్గరికి వచ్చాడు. నాతో ఇక మా దాశరథిదే బాధ్యత. పిల్లదాని చదువు ఒక దశకు తెచ్చాను. నాకేమయినా ఇక ఫరవాలేదు అన్నాడు. ఇటీవల పక్షం రోజులనాడు వచ్చాడు. రాత్రివేళ.. ఇక మళ్ళీ ఎక్కడికీ వెళ్లేదు. రాత్రిళ్లు, ఆ మాటకొస్తే, పగటి పూట కూడా ఎంతగానో దగ్గి బాధపడేవాడు. ఇక నాలుగయిదు రోజుల క్రితం బొత్తిగా లాభంలేని పరిస్థితి వచ్చింది. ఇక్కడి డాక్టరొకాయన చూసి పెదవి విరిచిపోయాడు. ఇక మనం మాత్రం ఏం చేయగలం ? అప్పుడప్పుడు కాస్త కనిపెట్టుకుని నేను పక్కనే కూర్చునేవాణ్ణి. వొచ్చే తెలివీ... పోయే తెలివీ. మాట ఎప్పుడో పడి పోయింది. అంతా అయిపోయిందనుకున్నప్పుడు చుట్టుపక్కలవారు కూడా చేరారు. తెల్లవారుజామున ఎప్పుడో చిలకెగిరిపోయింది.'

దాశరథి తట్టుకోలేకపోయాడు. ఉన్నట్టుండి లేచాడు.

ఆయన కూడా లేచి 'మీరు డీలాపడిపోతే ఎలా ? అసలు పని అంతా ఇప్పుడే వుంది. మీతోనే వుంది. నా బాధ్యత కూడా నెరవేర్చుకోనివ్వండి' అన్నాడు.

'రండి నాతో' అంటూ పై పంచె కప్పుకుని దారితీశాడు.

దాశరథి ఒణుకుతున్న కాళ్లతో ఆయన వెంట నడిచాడు.

అర్జునుడి ఇల్లు...

ఆయన తాళం తీశాడు.

లోపల గదిలో అంధకారం. ఒక చోట కిటికీ పక్కగా అర్జునుడి తోలుసంచి.

ఆయన 'ఇదుగో... మీ కోసమే' ఇది అంటూ దాన్ని పట్టుకొచ్చాడు.

'ఇందులో అతని సరంజామా అంతావుంది. ఈ విల్లూబాణాలు మీకక్కరలేదు' అంటూ అన్నింటినీ ఇవతలికి తీశాడు.

లోపల చిత్రమైన, రహస్యమైన ఒక అర ఉంది. ఆయన అందులోనుంచి పెద్ద పెద్ద నోట్ల కట్టలు ఇవతలికి తీశాడు.

'ఇవి మాత్రం మీ కోసం. మీకు అందజేయమని నాకు పురమాయించి పోయాడు.'

దాశరథి కళ్లవెంట నీరు ఉబికి వచ్చింది.

ఆయన సానుభూతితో 'మీ బాధ నేను అర్థం చేసుకోగలనులెండి. నా అరవై ఏళ్ల జీవితంలో ఎంతో చూశాను: అనుభవించాను. మీరు మనసును కుదుట పరచుకోవాలి. అతను జీవిత సర్వస్వం అనుకుని పెంచిన పిల్ల కోసం ఈ కష్టార్జితం. అమ్మాయిని మీ చేతుల్లో భద్రంగా ఉంచాడు. ఇది కూడా మీకే అప్పజెప్పమన్నాడు' అన్నాడు.

దాశరథి వాటిని అందుకుని అచేతనుడై కన్నీరు కారుస్తూ నిలబడిపోయాడు.

'ఇక మిమ్మల్ని మీరు సంబాళించుకోవాలి. బాధ సరే ఎలాగూ తప్పదు. కానీ మీరు ఎలాటివారో అర్జునుడు నాకు చెప్పాడు. మనసు రాయి చేసుకుని ముందడుగు వెయ్యాలి మీరు. అతని కోరిక అది.'

ఇద్దరూ ఇవతలికి వచ్చారు.

ఆయన వాకిలి తాళం వేసి 'ఈ అధ్యాయం పూర్తిఅయిందికదా ? రండి. కాస్త ఏమన్నా తిందురుగాని. ముందు స్నానం చెయ్యండి. భోజనం చేసి కాస్సేపు విశ్రాంతి తీసుకోండి. రెండు గంటల వేళ బయలుదేరి వెళితే రైలు అందుకుంటారు. నేను కూడా మీతో స్టేషను దాకా వస్తాను. వీలయితే ఏదన్నా బండి ఒకటి చూస్తాను' అన్నాడు.

దాశరథి స్నానం చేశాడు. భోజనం చేశాడు.

ఆయన అంతసేపూ ఏదో మాట్లాడుతూనే వున్నాడు. దాశరథి ఎక్కువ మాట్లాడలేదు. ఆ తర్వాత కాస్సేపు పడుకుందామనిపించి వరండాలో బల్ల మీద నడుం వాల్చాడు. కళ్లు మూసుకున్నాడు. అంతలో గాఢంగా నిద్రపట్టింది.

స్టేషనులో..

బల్లమీద కూర్చున్నారిద్దరూ.

ఆ వ్యక్తి తన సొంత విషయాలేవో చెబుతున్నాడు.

చుట్టూ ఏమీ అలికిడిలేదు. అంతా ప్రశాంతంగా ఉంది.

దాశరథి మనసు క్రమంగా తేలికపడుతున్నది.

పోర్టరు గంట మోగించాడు.

ఇద్దరూ లేచారు.

ఆయన తటపటాయిస్తూనే 'నేనిక ఉంటాను' అన్నాడు.

అప్పుడు దాశరథి ఏదో స్ఫురించిన వాడిలో ఉన్నట్టుండి 'అన్నట్టు అసలు విషయం అడగడం మరిచేపోయాను. ఆపిల్ల ఎవరు ? అంటే ఎవరి తాలూకు? అది చెప్పనేలేదు

అ[illegible]ను
మీ[illegible].' అన్నాడు.

రైలు దూరంగా కూత పెడుతున్నది. ఆయన నవ్వి చేతి వేళ్లు విరుచుకుని - 'అది తెలుసుకోక తప్పదా ?' అన్నాడు.

దాశరథి మౌనం వహించాడు.

ఆయన 'పోన్లెండి... చెబుతాను' అన్నాడు.

రైలు కనుచూపు మేరలోకి వచ్చింది. 'ఆ పసికందు తండ్రి కరీముల్లా. మీ చిన్నప్పటి స్నేహితుడే. పేదవాడైనా మంచివాడు. సైన్యంలో చేరాడు భుక్తి కోసం. పక్క ఊరి పిల్లను, వాళ్లూ ముస్లిములే. కోరిచేసుకున్నాడు. ఆ అమ్మాయి మెహర్. మెహరున్నీస్సా. అనాథలరాశి... ఆ విధంగా వారి కథ ముగిసింది. ఆ పిల్ల పేరుబానో... స[illegible]బానో.. ఇప్పటి మీ భానుమతి...'

రైలు వచ్చేసింది.

ఆ మాటలు చెప్పి ఆయన విసవిస నడిచి వెళ్లిపోయాడు.

రైలు రణగొణ ధ్వని చేస్తూ వచ్చి ఆగింది.

దాశరథి ఒక్కక్షణం ప్రతిమలా నిలబడి ఆ తర్వాత కదిలి రైలెక్కాడు.

****

ఇంటి గుమ్మంలోనే ఎదురైంది శాంతమ్మ.

'వచ్చారా ? ఏమిటంత అర్జంటు టూరు ప్రోగ్రాము?' అన్నది.

దాశరథి 'ఏమీలేదు.. మామూలే' అంటూ లోపలికి వెళ్లాడు.

ఆదివారం కావడంవల్ల ముందు గదిలోనే ఉన్నారు ముగ్గురూ.

దాశరథి వారి ముందుకు వెళ్లి నిలబడ్డాడు, కొన్ని క్షణాలు కదలకుండా. భాను అప్పుడు వసంతకు ఏదో పాఠం వివరిస్తున్నది.

దాశరథిని చూడగానే ఆమె లేచి నిలబడింది.

దాశరథి 'కూర్చో...కూర్చో' అన్నాడు.

తర్వాత బట్టలైనా మార్చుకోకుండా తాను అక్కడే కూర్చున్నాడు. భాను వంకనే చూస్తూ కూర్చున్నాడు.

*****

ఆనాడు రాత్రి...

పదిగంటలు దాటింది.

భార్యాభర్తలిద్దరూ పక్కగదిలో కూర్చుని చాలా సేపటినుంచి మాట్లాడుకుంటున్నారు. పిల్లలు చదువు ముగించి పజిల్స్ సాల్వ్ చెయ్యడంలో తలమునకలుగా ఉన్నారు.

శాంతమ్మ నెమ్మదిగా లేచింది.

'అంతేనంటేరా ?' అన్నది.

'అంతే.... భానును పిలుచుకురా...చెప్పాలి...చెప్పి తీరాలి.

శాంతమ్మ నెమ్మదిగా కదిలి వెళ్లింది.

దాశరథి చేతివేళ్లు విరుచుకున్నాడు.

తనకు రైలుస్టేషనులో... రైలెక్కే ముందు మాత్రమే తెలిసిన విషయం భార్యకు చెప్పలేదు. ఎప్పటికీ చెప్పడు కూడా. అర్జునుడి విషయం మాత్రం వివరంగా చెప్పాడు. ఆమె అంతా విని దిగులుపడింది.

మరునిముషంలో శాంతమ్మ భానును వెంట బెట్టుకుని వచ్చింది.

'కూర్చో అమ్మా' అన్నాడు దాశరథి.

భానుచిత్రంగా చూసింది. కూర్చున్నది. దాశరథి వాలకం చూడగానే తెలివిగల పిల్ల కాబట్టి ఏదో అనుమానం వంటిదే కలిగింది.

దాశరథి గొంతు సర్దుకుని - 'చూడు తల్లీ! నువ్విక్కడే ఉండిపోవాలి. ఇక ఇదే నీ ఇల్లు. ఇంకా చదువుకుంటానన్నా ఇంకేమీ చేస్తానన్నా నేను కాదనను. నీ ఇష్టమే మా ఇష్టం' అన్నాడు.

భాను తలెత్తి కళ్లు పెద్దవి చేసుకుని వింతగా చూసింది. ఏదో వినరాని విషయం వినబోతున్నాని అర్థమయింది ఆమెకు.

దాశరథి గద్గద స్వరంతో - 'మా అర్జునుడిక రాడు....లేడు...' అన్నాడు.

భాను అదిరిపడింది.

'ఎప్పుడు ?' అని అడిగింది కంపిస్తున్న స్వరంతో 'అయిపోయింది.. దుర్మార్గుడు. ముందుగా తెలియ నివ్వనైనాలేదు' అతని గొంతు బొంగురుపోయింది. భాను కళ్లలో నీళ్లు ఉబికివచ్చాయి. కాస్సేపు చేతుల్లో ముఖం దాచుకుని నిశ్శబ్దంగా రోదించింది. శాంతమ్మ ఆ పిల్ల భుజంమీద చెయ్యి వేసి అనునయించింది.

కాసేపటికి ఆమె తేరుకున్నది. కళ్లు ఎరుపెక్కాయి. తర్వాత నెమ్మదిగా లేచి ఇవతలి గదిలోకి వచ్చింది.

మరునాడు ఉదయం....

దాశరథి హాలులో కూర్చుని ఉన్నాడు.

అన్నా చెల్లెళ్లిద్దరి మధ్యా కూర్చుని ఉంది భాను. దినపత్రిక కోసం పోట్లాడు కుంటున్న అన్నా చెల్లెళ్లకు చెరొక కాగితమూ పంచి ఇచ్చి తానొకటి తీసుకుని చదువుతున్నది.

శాంతమ్మ కాఫీ తెచ్చింది.

అందుకుంటూ దాశరథి కళ్లతోనే నవ్వి అటు చూడమని సైగచేశాడు. ఆమె అటు చూసింది. ఎదురుగా సోఫాలో ముగ్గురు.

అందాల రంగుల ఫోటోలోలాగా... ముచ్చటగా దంపతులిద్దరి మనసులలోనూ ఒకే భావం మెదిలింది.

ఇన్నాళ్ళూ మనకిద్దరు... ఇప్పుడు ముగ్గురు....

(స్వాతి సపరివారపత్రిక నవంబరు, డిసెంబర్, జనవరి **1993**)